జాతీయ తెలుగు దినపత్రిక

# ప్రజాజ్యోతి

ప్రతి అక్షరం ప్రజల కోసం



WANTED

గత 15 సంవత్సరాలుగా ప్రజల మన్ననలు పొందుతూ ప్రజల సమస్యలే ధ్యేయంగా పోరాడుతున్న "ప్రజాజ్యోతి" జాతీయ దినపత్రికకు తెలంగాణ మరియు ఆంధ్రప్రదేశ్ వ్యాప్తంగా జిల్లా స్టాఫ్ రిపోర్టర్, నియోజకవర్గ ఇంఛార్జీలు మరియు మండల రిపోర్టర్లు కావలెను.

అనుభవం కలిగిన రిపోర్టర్లు మరియు చక్కటి వార్తలు రాయగలిగే కొత్తవారికి కూడా అవకాశం కల్పించబడును.

ప్రజాజ్యోతి

సంప్రదించవలసిన నెంబర్లు

9440231967, 7989694528



రంగారెడ్డి మంగళవారం 10 ఫిబ్రవరి 2026 సంపుటి : 1 సంచిక :42 వెల: రూ.5 పేజీలు: 08

RNI NO.APTEL/2010/36516

విక్రం సంవత్సరం - పింగళ 2081, ఆషాఢము 3 ఇండియన్ సివిల్ క్యాలెండర్ - 1946, ఆషాఢము 17 పుర్నిమంతా - 2081, ఆషాఢము 16 అమాంత - 2081, ఆషాఢము 3 తిథి శుక్లపక్షం తదియ నక్షత్రం పుష్యమి

Published from RANGAREDDY, WARANGAL, KAMMAM, NALAGONDA http://www.prajajyothinews.com Mail: prajajyothidaily@gmail.com


# 'పుర హోరు'కు తెర


- సమావేశాలు, ర్యాలీలు సహా అన్ని రకాల ప్రచారంపై నిషేధం
- ప్రచార గడువు ముగిసిన తర్వాత ఎలాంటి సభలు, ఊరేగింపులు నిర్వహించడం లేదా పాల్గొనకూడదు
- సినిమాలు, టీవీలు, ఇతర ప్రచార, ప్రసార మాధ్యమాల ద్వారా కూడా ఎలాంటి ఎన్నికల ప్రచారం చేయకూడదు



హైదరాబాద్

మున్సిపల్ ఎన్నికల్లో అత్యంత కీలకమైన ప్రచార ఘట్టానికి సోమవారం సాయంత్రం ఐదు గంటలకు తెర పడింది. ప్రచార గడువు ముగిసిన తర్వాత ఎలాంటి సభలు, ఊరేగింపులు నిర్వహించడం లేదా పాల్గొనకూడదని రాష్ట్ర ఎన్నికల సంఘం స్పష్టం చేసింది. సినిమాలు, టీవీలు, ఇతర ప్రచార, ప్రసార మాధ్యమాల ద్వారా కూడా ఎలాంటి ఎన్నికల ప్రచారం చేయకూడదని హెచ్చరించింది. సంగీత విభావరులు, నాటకాలు, విందులు, ఇతర రూపాల్లో ప్రచారం చేసినా చర్యలు ఉంటాయని స్పష్టం చేసింది. బుధవారం సాయంత్రం ఐదు గంటలకు పోలింగ్ ముగిసే వరకు 48 గంటలపాటు ఎన్నికల సంఘం ఆదేశాలను కచ్చితంగా పాటించాలని పేర్కొంది. ఎన్నికల సంఘం ఆదేశాలను ఉల్లంఘించి ప్రచారం చేస్తే రెండేళ్ల జైలు శిక్షతోపాటు జరిమానా ఉంటుందని హెచ్చరించింది. మొబైల్ ఫోన్లు, సోషల్ మీడియా ద్వారా ఎన్నికల ప్రచారం చేసినా చర్యలు ఉంటాయని చెప్పింది. పోటీ చేస్తున్న అభ్యర్థులు, రాజకీయ పార్టీలు, పార్టీ ప్రచారకర్తలు ఎన్నికల నియమావళి మేరకు వ్యవహరించాలని సూచించింది. ఈ మేరకు ఎన్నికల సంఘం కార్యదర్శి లింగ్యానాయక్ సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. సోమవారం సాయంత్రం ఐదు గంటల నుంచి బుధవారం సాయంత్రం ఐదు గంటల

- మిగతా 2లో



## లోక్‌సభ స్పీకర్‌పై అవిశ్వాస తీర్మానం!

- రాహుల్‌కు మాట్లాడే అవకాశం ఇవ్వడం లేదని ఆగ్రహం
- 103 మంది సభ్యుల సంతకాల సేకరణ
- సభాపతితో విపక్ష నేత భేటీ..
- తాను సభలో ఏం చెబుతానోననే భయంలో ప్రధాని ఉన్నారు
- నిజాన్ని ఎదుర్కొనే ధైర్యం ఆయనకు లేదు

5

# కాంగ్రెస్‌కు మళ్లీ ఓటేస్తే ఆగమే

భూపాలపల్లి, పరకాల, మహబూబాబాద్ సభల్లో కేటీఆర్

ఇప్పటికే గోస పడుతున్నం.. ఇకపై ఆ పరిస్థితి వద్దు

కేసీఆర్‌ను తిట్టినోళ్లను వదిలిపెట్టం



వరంగల్/మహబూబాబాద్/భూపాలపల్లి/గూడూరు:

'అబద్ధపు హామీలు ఇచ్చి కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చింది. సోనియాగాంధీ, రాహుల్ గాంధీల మీద ఒట్టేసి హామీలిచ్చి గద్దెనెక్కిన రేవంత్ రెడ్డి ఆ తర్వాత వాటిని గాలికి వదిలేశారు. ప్రజలు, ప్రతిపక్షాలు అభివృద్ధి,సంక్షేమం గురించి నిలదీస్తే డైవర్షన్ పాలిటిక్స్ చేస్తున్నారు. అబద్ధపు హామీలు, మాటలు నమ్మి ఓట్లేస్తే మళ్లీ ఆగమైతం..'అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కల్వకుంట్ల తారకరామారావు అన్నారు. కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం అధికారంలోకి వస్తే కల్యాణలక్ష్మి డబ్బులకు తోడు తులం బంగారం కలిపి ఇస్తామని చెప్పడంతోపాటు అనేక ఇతర హామీలిచ్చి నెరవేర్చలేని రేవంత్ రెడ్డికి పాలన చేయడం చేతకావడం లేదని విమర్శించారు. రెండేళ్ల తర్వాత ఎగిరేది గులాబీ జెండానే అని ధీమా వ్యక్తం చేశారు. సోమవారం ఉమ్మడి వరంగల్‌లోని భూపాలపల్లి,

- మిగతా 2లో



## తొలి ఎన్నికల బరిలో విజయ్

- రెండు నియోజకవర్గాల నుంచి పోటీ!
- చెన్నైలోని విరుగంబాక్కం, తిరుచ్చి తూర్పు స్థానాలపై విజయ్ గురి
- పట్టణ, ప్రాంతీయ ఓటర్లను ఆకట్టుకునేందుకు పక్కా వ్యూహం
- రెండు స్థానాల్లోనూ అధికార డీఎంకేతోనే విజయ్ ప్రధాన పోటీ

5



## ఎస్ఐఆర్ ప్రక్రియకు అడ్డంకులు రానివ్వం

- అవసరమైతే ఆదేశాలు జారీ చేస్తాం: సుప్రీంకోర్టు
- ఎస్ఐఆర్ ప్రక్రియను ఎవరూ అడ్డుకోవద్దని స్పష్టమైన ఆదేశాలు
- మాస్ ఎక్స్‌క్లూజన్ జరగకూడదన్న వాదనపై కోర్టు స్పందన

5

## డిజిటల్ మోసాల కేసులను ఎదుర్కోవడానికి ఎస్ఓపీని రూపొందించండి

- కేంద్రానికి సుప్రీంకోర్టు ఆదేశం
- డిజిటల్ మోసాలపై సుమోటోగా సుప్రీం కోర్టు విచారణ

# అభివృద్ధి బాధ్యత నాదే.. ఆశీర్వదించండి



- పాలన బేరీజు వేసి మంచి నిర్ణయం తీసుకోండి
- భారాసకు ఓట్లడిగే అర్హతే లేదు - గల్లీ ఎన్నికలతో మోదీకి ఏం సంబంధం?
- జనగణన అయ్యే వరకు జిల్లాల సరిహద్దులు మార్చవద్దని కేంద్రం ఆదేశాలున్నాయి
- ప్రతి మున్సిపాలిటీకి మాస్టర్‌ప్లాన్ తెస్తాం
- మేం బీసీలకు పార్టీపరంగా 61 శాతం టికెట్లు ఇచ్చాం.. ఇదీ మా నిబద్ధత
- మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్, భాజపా, భారాసల మధ్య త్రిముఖ పోరు జరుగుతోంది

5

హైదరాబాద్

బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అడ్డుకోవడానికి కోర్టులో పిటిషన్ వేసిన వ్యక్తికి మున్సిపల్ ఎన్నికల్లో భారాస టికెట్ ఇచ్చింది. మేం బీసీలకు పార్టీపరంగా 61 శాతం టికెట్లు ఇచ్చాం. ఇదీ మా నిబద్ధత. మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్, భాజపా, భారాసల మధ్య త్రిముఖ పోరు జరుగుతోంది. ఎవరు అభివృద్ధి చేయగలరో ఆలోచించండి. అవసరమైనప్పుడు కేంద్రంపై కొట్లాడటానికి ఈ ప్రభుత్వానికి బేషజాలు లేవు. భారాసలా చీకటి ఒప్పందాలు, కేంద్రంతో కుమ్మక్కవ్వాల్సిన అవసరం మాకు లేదు. 'పన్నెండేళ్లుగా కేంద్రంలో అధికారంలో ఉన్న భాజపా తెలంగాణకు చేసిందేమీ లేదు.. పదేళ్ల భారాస పాలనంతా అవినీతిమయం.. రెండేళ్లుగా కాంగ్రెస్ ప్రభుత్వం అనేక సంక్షేమ కార్యక్రమాలు చేపట్టింది. వీటన్నింటినీ బేరీజు వేసి సమాజానికి ఏది మేలు చేస్తుందనేది ఆలోచించి మున్సిపల్ ఎన్నికల్లో ఓటు వేయాలి' అని సీఎం రేవంత్‌రెడ్డి ప్రజలకు పిలుపునిచ్చారు. ప్రతి పురపాలక సంఘం అభివృద్ధికి మాస్టర్‌ప్లాన్ తయారు చేయించి వచ్చే మూడేళ్లలో అభివృద్ధి పథంలో నడిపిస్తానని ముఖ్యమంత్రిగా, పురపాలకశాఖ మంత్రిగా ఈ బాధ్యతను తీసుకుంటానని ఈ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు పట్టం కట్టాలని కోరారు. సోమవారం జూబ్లీహిల్స్ లోని తన నివాసంలో ఏర్పాటుచేసిన

- మిగతా 2లో

# సాంకేతికతకు సాగిలపడొద్దు

- నేర్చుకోవడం మానేసి ఏఐపై ఆధారపడొద్దు
- పరీక్షాపే చర్చా కార్యక్రమంలో విద్యార్థులకు ప్రధాని మోదీ హితబోధ
- పాతవి తిరగేయండి.. హాయిగా నిద్రపొండి
- ఆధునిక సాంకేతికతలను అందిపుచ్చుకుంటూ వాటిలోనూ మీరు రాణించాలి
- ఏఐ లేదా స్మార్ట్‌ఫోన్‌ను అత్యున్నత గురువుగా భావించొద్దు.

5



# అభివృద్ధి బాధ్యత నాదే.. ఆశీర్వదించండి

-మొదటిపేజీ తరువాయి

మీడియా సమావేశంలో, అనంతరం చిట్‌చాట్‌లో ముఖ్యమంత్రి మాట్లాడారు. "సంపూర్ణంగా మాకు సహకరించి ఆశీర్వదిస్తే సమస్యలన్నీ పరిష్కరిస్తాం. వచ్చే మూడేళ్లు రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలో ఉంటుంది.. ఆ తర్వాత వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో సైతం రెండోసారి గెలుస్తుంది. మోదీని చూసి ఓటువేయాలని భాజపా వాళ్లు అడుగుతున్నారు. ఈ ఎన్నికలకు మోదీకి ఏం సంబంధం. మున్సిపాలిటీలో పారిశుద్ధ్య సమస్య వస్తే తీర్చాల్సింది రాష్ట్ర ప్రభుత్వం కాదా?
ఓట్లు వేయించుకుని సీట్లు తెచ్చుకోవడం తప్ప తెలంగాణకు భాజపా ఇచ్చింది ఏమీ లేదు. రాష్ట్రంలో ప్రస్తుత సమస్యలకు ప్రధాన కారణం కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావులు కాదా? మళ్లీ ఇప్పుడు ఏ ముఖం పెట్టుకుని ఓట్లు అడుగుతున్నారు. నైతికతకు దూరంగా ఉన్న భారాసకు అసలు ఓటు అడిగే అర్హతే లేదు. మొక్కను కూడా మొలవనీయకూడదంటే యాసిడ్ పోసి కడుగుతారు. అలా భారాసని యాసిడ్ పోసి కడిగితే గానీ తెలంగాణ సమాజం దుర్భర పరిస్థితి నుంచి బయటపడదు.

**భారాస వాళ్లు నెగ్గితే అభివృద్ధికి సహకరిస్తారా?**

మున్సిపల్ ఎన్నికల్లో భారాస వాళ్లు అక్కడక్కడా నెగ్గితే అభివృద్ధికి సహకరిస్తారా? అహంకారం, విషం, విద్వేషపూరిత ప్రసంగాలతో రెచ్చగొట్టే మాటలు మాట్లాడుతున్నారు. పెద్దపెద్ద చదువులు చదివినవారు మాట్లాడే మాటలేనా అవి? కేసీఆర్ క్యాబినెట్ ర్యాంకుతో ప్రతిపక్ష నేత హోదాలో ప్రభుత్వం నుంచి అన్ని వసతులు పొందుతూ శాసనసభలో ఒక్క సమస్యపైనా మాట్లాడలేదు. ఇప్పుడు మున్సిపల్ ఎన్నికల్లో భారాసకు ఓటు వేస్తే గెలిచిన వాళ్లు కూడా కేసీఆర్ మాదిరిగా బయటికి వస్తారా?

**కేసీఆర్, హరీశ్‌రావును సీబీఐ విచారణకైనా ఎందుకు పిలవడం లేదు?**

భారాస పాలనలో ఇసుక, గాలి, నీరు, ఇళ్లు.. ఇలా దేన్నీ వదలకుండా అవినీతికి పాల్పడ్డారు. చివరికి ఫోన్‌లో మాట్లాడుకునే ప్రతిపక్షాలవారిని, జడ్జిలను, జర్నలిస్టులను, సినీతారలను కూడా వదలలేదు. పోలీసు అధికారులు తప్పిదాలకు పాల్పడిన నేరగాళ్లను పట్టుకొచ్చినప్పుడు వారు సిగ్గుతో తలపై ముసుగు వేసుకుంటారు. భారాస నేతలను విచారణకు పిలిచినప్పుడు అలా పోకుండా, ఏదో యుద్ధం చేసి దేశాన్ని గెలిచినట్లు చేతులు ఊపుతూ వెళుతున్నారు. మీ ప్రేమ ఉంటే చాలు.. అంటూ ఇంకేమీ అవసరం లేదని గజ్వేల్ సభలో మోదీతో కేసీఆర్ అన్నారు. మోదీ ప్రేమలో యుగళగీతం పాడుకున్నది మీరు కాదా? అంత పెనవేసుకున్న బంధాన్ని తెలంగాణకు నిధులు తేవడానికి వినియోగించారా? కాళేశ్వరాన్ని ఏటీఎంగా మార్చుకున్నారని రూ.వేల కోట్ల అవినీతి జరిగిందని మోదీ, అమిత్‌షా అన్నారు. ఆ కేసును సీబీఐకిస్తే 48 గంటల్లో కేసీఆర్‌ను అరెస్టు చేస్తాం.. మీకు చేతకావడం లేదా అని కిషన్‌రెడ్డి అనడంతో సీబీఐకిచ్చాను. ఆరునెలలైనా కేసీఆర్, హరీశ్‌రావును కనీసం విచారణకు ఎందుకు పిలవడం లేదు. ఫార్ములా-ఈ కార్ రేసు కేసు ఈడీ దగ్గరున్నా కేటీఆర్‌ను ఎందుకు అరెస్టు చేయడం లేదు? ఇన్నాళ్లు మీరు సహకరించినందువల్లే ఇప్పుడు వారు స్పందించడం లేదు. ఇది క్విడ్ ప్రోకో కాదా?

**ఇంకెంత కాలం మతరాజకీయాలు చేస్తారు?**

2014 ఎన్నికల వేళ పాలమూరు సభలో పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టుకు జాతీయ ప్రాజెక్టు హోదా ఇస్తామని మోదీ హామీ ఇచ్చారు. ఇటీవల జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీన్ తెలంగాణకు వచ్చినప్పుడు ఈ అంశాన్ని ప్రస్తావించి జాతీయ హోదా ప్రకటిస్తారనుకున్నాం. హైదరాబాద్ వరదల సమయంలో ముంపునకు గురైన సందర్భంలో కారుకు కారు, బైకుకు బైకు ఇస్తామని జీహెచ్ఎంసీ ఎన్నికల్లో బండి సంజయ్ ప్రచారం చేశారు. కిషన్‌రెడ్డి ఆ హామీలకు ఆమోదం తెలిపారు. మూడోవంతు డివిజన్లలో గెలిచాక ఆ ఊసే ఎత్తలేదు. కేంద్రం నుంచి నిధులు తెచ్చి అభివృద్ధి చేస్తామని ఇప్పుడు నమ్మించే ప్రయత్నం చేస్తున్నారు. కేంద్రం నుంచి ఏ మంత్రి వచ్చినా రూ.లక్షల కోట్లు మంజూరు చేశామని చెబుతున్నారు. రాజ్యాంగబద్ధంగా రాష్ట్రానికి రావాల్సిన వాటానే ఇస్తున్నారు. రాష్ట్రం నుంచి కేంద్రానికి రూపాయి పన్ను చెల్లిస్తే అందులో 42 పైసలే తిరిగిస్తున్నారు. బిహార్‌కు రూ.6.06, మధ్యప్రదేశ్‌కు రూ.2.09, ఉత్తర్‌ప్రదేశ్‌కి రూ.2.90 చొప్పున ఇస్తున్నారు. ఈ వివక్షపై మోదీని కానీ, కేంద్ర ప్రభుత్వాన్ని గానీ, నీతి ఆయోగ్‌ను ఏ రోజైనా అడిగారా అని కేంద్ర మంత్రులు బండి సంజయ్, కిషన్‌రెడ్డిని ప్రశ్నిస్తున్నా. అసదుద్దీన్ ఒవైసీని భూతంగా చూపి ఇంకెంత కాలం మత రాజకీయాలు చేస్తారు?

**దేవాలయాలకు విజయ నెయ్యి వాడాలని ఆదేశాలిచ్చాం..**

సీబీఐ తిరస్కరిస్తే కాళేశ్వరంపై రాష్ట్ర ప్రభుత్వం తగిన చర్యలు తీసుకుంటుంది. ఫోన్ ట్యాపింగ్‌లో కీలక నిందితుడు ప్రభాకర్‌రావును 20 నెలల పాటు అమెరికాలో దాచిపెట్టారు. ఆయనను తీసుకువచ్చాక కేసు విచారణ వేగం పుంజుకుంది. తమను అరెస్టు చేయమని కేటీఆర్, హరీశ్‌రావు పోటీపడుతున్నారు. ఎవరు జైలుకుపోతే వారే సీఎం అవుతారని అనుకుంటున్నారు. కవిత తానే ముందు జైలుకు పోయి వచ్చా కదా అని అంటున్నారు. అధికారంలో ఉన్నంతకాలం వారంతా కలసి ఉన్నారు. అధికారం పోగానే గొడవలు పడుతున్నారు. వారి గొడవలతో నాకేం సంబంధం? జనాభా లెక్కల నేపథ్యంలో 2026 జనవరి ఒకటి నుంచి 2027 మార్చి 31 వరకూ జిల్లాల సరిహద్దులు మార్చవద్దని కేంద్రం ఆదేశాలున్నాయి. జిల్లాలను మార్చాలనే వ్యక్తిగత ఆసక్తి మాకేం లేదు. జనగణన తర్వాత నియోజకవర్గాల పునర్విభజన, పెంపు ఉంటుంది. ఆ తరవాత 2029లో జమిలి ఎన్నికలు జరుగుతాయి. జనాభా ప్రాతిపదిక లేదా ప్రోరేటాలో ఏ విధానం తీసుకున్నా నియోజకవర్గాల పెంపుతో తెలంగాణకు, దక్షిణాదికి నష్టమే. ఇప్పుడు రాష్ట్రాలవారీగా లోక్‌సభ నియోజకవర్గాల మధ్య వ్యత్యాసాన్ని అలాగే కొనసాగిస్తూ నియోజకవర్గాల సంఖ్య పెంచాలి. ఉదాహరణకు ఇప్పుడు ఉత్తర్‌ప్రదేశ్‌కు, తెలంగాణకు మధ్య 63 పార్లమెంటు నియోజకవర్గాల వ్యత్యాసం ఉంది. పెంపు తర్వాత ఇంతే వ్యత్యాసం ఉండేలా అన్ని రాష్ట్రాలకు సమానంగా పెంచితేనే న్యాయం జరుగుతుంది. తెలంగాణ దేవాలయాలకు విజయ డెయిరీ నెయ్యినే వాడాలని ఆదేశాలిచ్చాం. కల్తీకి అవకాశం లేదు" అని సీఎం చెప్పారు.

**రాష్ట్రమంతటా జూబ్లీహిల్స్ ఫలితం పునరావృతం కావాలి**

మున్సిపల్ ఎన్నికలను అందరూ సీరియస్‌గా తీసుకోవాలి

ముఖ్యనేతలతో సమీక్షలో సీఎం రేవంత్‌రెడ్డి

పోలింగ్ వరకు సమన్వయంతో పని చేస్తే అత్యధిక స్థానాలు దక్కించుకుంటామని... వచ్చే రెండు రోజులు మున్సిపల్ ఎన్నికల్లో కలిసికట్టుగా పని చేయాలని మంత్రులు, ఎమ్మెల్యేలు, కార్యకర్తలకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సూచించారు. జూబ్లీహిల్స్ ఉపఎన్నికలో ఎలాగైతే సమన్వయంతో పని చేసి విజయం సాధించామో.. ఈ ఎన్నికల్లోనూ రాష్ట్రమంతటా దాన్ని పునరావృతం చేయాలని పేర్కొన్నారు. సోమవారం ఉదయం 6.30 గంటలకు ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, ఏఐసీసీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌ఛార్జి మీనాక్షి నటరాజన్, పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్, సీఎం సలహాదారు వేం నరేందర్‌రెడ్డి తదితరులతో కలిసి పుర ఎన్నికలపై ముఖ్యమంత్రి జూమ్ మీటింగ్ నిర్వహించారు. మంత్రులు, డీసీసీ అధ్యక్షులు, ముఖ్యనాయకులు హాజరయ్యారు. లోక్‌సభ నియోజకవర్గాల వారీగా ఇన్‌ఛార్జులుగా నియమించిన మంత్రుల నుంచి వారి పరిధిలోని నగరపాలక, పురపాలక సంఘాల్లో పరిస్థితిని తెలుసుకొన్న తర్వాత, సర్వేల్లో వ్యక్తమైన వివరాలను సీఎం వెల్లడించినట్లు తెలిసింది. కార్పొరేషన్లన్నింటిలో పరిస్థితి మెరుగ్గా ఉందని, పురపాలక సంఘాల్లో మాత్రం కొన్నిచోట్ల ఎమ్మెల్యేలు సీరియస్‌గా తీసుకోకపోవడం, నాయకుల మధ్య సమన్వయం లోపం, రెబెల్స్‌కు నచ్చజెప్పలేకపోవడం వంటి సమస్యలు ఉన్నాయని చెప్పినట్లు సమాచారం. పోలింగ్ నాటికి వీటిపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించినట్లు తెలిసింది. ఉమ్మడి వరంగల్, మహబూబ్‌నగర్, మెదక్, ఆదిలాబాద్, కరీంనగర్, నిజామాబాద్‌లోని కొన్ని పురపాలక సంఘాలపై ఇన్‌ఛార్జి మంత్రులకు పలు సూచనలు చేసినట్లు తెలుస్తోంది. ఓ మంత్రి ప్రాతినిధ్యం వహిస్తున్న నియోజకవర్గ కేంద్రంలో పరిస్థితిపై సీఎం ప్రత్యేకంగా ప్రస్తావించినట్లు వినికిడి. ప్రతిఒక్కరు ఈ ఎన్నికలను సీరియస్‌గా తీసుకోవాలని, లోక్‌సభ నియోజకవర్గాల వారీగా బాధ్యతల్లో ఉన్న మంత్రులు మున్సిపాలిటీల వారీగా పరిస్థితిని అంచనా వేసుకొని కాంగ్రెస్ అభ్యర్థులను విజయం వైపు నడిపించేందుకు కృషి చేయాలని సూచించారు. ఎమ్మెల్యేలకు, ఇతర నాయకులకు సమస్యలుంటే ఇద్దరితో కలిసి సమన్వయం చేసుకోవాలని పేర్కొన్నారు.

# కాంగ్రెస్, బీజేపీ మధ్యే మున్సిపోరు

గోదావరిఖని/శ్రీరాంపూర్

రాష్ట్రంలో బీఆర్ఎస్ కనుమరుగైందని, మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్, బీజేపీ మధ్యే పోటీ ఉంటుందని కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి కిషన్ రెడ్డి పేర్కొన్నారు. బీజేపీ రాష్ట్రంలో అధికారంలోకి వస్తే సింగరేణి కార్మికులకు ఇప్పటికే కోత విధించిన ఆదాయపన్ను తిరిగి చెల్లిస్తామని, భవిష్యత్‌లో పూర్తిగా మాఫీ చేస్తామని మంత్రి కిషన్‌రెడ్డి అభయం ఇచ్చారు. పెద్దపల్లి జిల్లా గోదావరిఖనిలో బీజేపీ అభ్యర్థులకు మద్దతుగా ఆయన సోమవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. అనంతరం బీజేపీ కేంద్ర నాయకుడు ఎస్.కుమార్ నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సింగరేణిలో భయాకమైన పరిస్థితులు నెలకొన్నాయని, సింగరేణి అధికారులతో సమీక్షించాక అనేక విషయాలు వెలుగు చూశాయని తెలిపారు. రూ.51వేల కోట్లకన్నా అధికంగానే ప్రభుత్వం నుంచి బకాయిలు రావాల్సి ఉందని, బొగ్గు, విద్యుత్ తీసుకుంటూ ఒక్కపైసా చెల్లించడం లేదన్నారు. సంస్థ పనితీరు, సంక్షోభం గురించి కార్మిక సంఘాలు కూడా నిర్మోహమాటంగా అనేక విషయాలు వెల్లడించారన్నారు. ఈ విషయాలను ప్రధాని నరేంద్ర మోదీ దృష్టికి తీసుకెళ్తామని మంత్రి చెప్పారు.



**ముస్లిం ఓట్ల కోసమే రేవంత్‌ఖాన్‌గా..**

ముస్లిం ఓట్లకోసమే సీఎం రేవంత్‌రెడ్డి తన పేరును రేవంత్‌ఖాన్‌గా పెట్టుకున్నారని మంత్రి కిషన్‌రెడ్డి ఎద్దేవా చేశారు. మజ్లిస్ కనుసన్నల్లోనే కాంగ్రెస్ పనిచేస్తోందని ధ్వజమెత్తారు. గత బీఆర్ఎస్, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వాలు సింగరేణి సంస్థను దోచుకున్నాయని, రెండు పార్టీలకు సింగరేణి ఏటీఎంగా మారిందన్నారు. కారు గుర్తుకు భవిష్యత్ లేదని కేసీఆర్ కూతురు కవిత వ్యాఖ్యానిస్తున్నారని, కారులో ఒకటైరు కవిత, మరోటైరు కేటీఆర్ తీసుకెళ్లారని ఎద్దేవా చేశారు. కేసీఆర్ ఫాంహౌస్‌కే పరిమితం అయ్యారని, బీఆర్ఎస్ రాష్ట్రంలో కనుమరుగైందని పేర్కొన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్, బీజేపీ మధ్యే పోటీ ఉంటుందని చెప్పారు. కాంగ్రెస్ ఇచ్చిన హామీలను విస్మరిస్తూ ప్రజలను వంచనకు గురిచేస్తోందన్నారు. కార్పొరేషన్ ఎన్నికల్లో బీజేపీని గెలిపిస్తేనే రామగుండం అభివృద్ధి చెందుతుందన్నారు. నాయకులు ఎస్.కుమార్, దుగ్యాల ప్రదీప్, బల్మూరి వనిత, సంధ్యారాణి, సంజీవరెడ్డి, గోమాస శ్రీనివాస్, వెంకటేశ్వర్లు, కాసిపేట శివాజీ, కోమళ్ల మహేశ్, రాజమౌళి గౌడ్ పాల్గొన్నారు.

**సింగరేణిని దోచుకుంటున్నారు..**

కాంగ్రెస్ అంటేనే కమీషన్, కరప్షన్, మోసం, దగా అని, రాష్ట్ర ప్రభుత్వ పెద్దలు సింగరేణిని దోచుకుంటున్నారని కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి విమర్శించారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా సోమవారం ఆయన మంచిర్యాల జిల్లా శ్రీరాంపూర్ బస్టాండ్ వద్ద కార్నర్ మీటింగ్‌లో మాట్లాడారు. సింగరేణిని రక్షించుకోవాలంటే కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలకు కర్రు కాల్చి వాత పెట్టాలని, ఒకవేళ వారు గెలిస్తే మనకు వాత పెడుతారన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ ఎన్నికల ఇన్‌చార్జి ప్రేమేందర్‌రెడ్డి, రాష్ట్ర ఉపాధ్యక్షుడు రఘునాథ్‌రావు, జోనల్ అధ్యక్షుడు సత్రం రమేశ్, అభ్యర్థులు కమలాకర్‌రావు, ముఖేశ్‌గౌడ్, పొన్నవేని సదానందం, వనపర్తి కేత రాజేశ్, కాదాసి భీమయ్య తదితరులు పాల్గొన్నారు.

# స్కూల్ బస్సు.. ట్రాక్టర్ ఢీ

పర్వతగిరి:

వరంగల్ జిల్లా పర్వతగిరి మండలంలోని శ్రీనగర్‌కొంకపాక క్రాస్ రోడ్డు వద్ద సోమవారం సాయంత్రం స్కూల్ బస్సు.. ట్రాక్టర్ ఢీకొన్నాయి. ఈ ఘటనలో ట్రాక్టర్‌లో ప్రయాణిస్తున్న ఇద్దరు అక్కడికక్కడే మృతిచెందగా 8 మందికి గాయాలయ్యాయి. వరంగల్ నగరంలోని రంగశాయిపేట నిజాంపుర, చార్‌బౌలికి చెందిన మూడు కుటుంబాల వారంతా కలిసి ట్రాక్టర్‌లో ఆదివారం పర్వతగిరి మండలంలోని అన్నారం దర్గా షరీఫ్‌కు వెళ్లారు. సోమవారం సాయంత్రం తిరిగి వరంగల్‌కు బయలుదేరారు. సంగెం మండలం తీగరాజుపల్లిలో ఓ ప్రైవేటు స్కూల్ బస్సు పిల్లలను ఇంటి వద్ద దిగబెట్టేందుకు వస్తోంది. ఈ క్రమంలో మార్గమధ్యలోని శ్రీనగర్‌కొంకపాక క్రాస్ రోడ్డు వద్ద స్కూల్ బస్సు ఎదురుగా వస్తున్న ట్రాక్టర్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ట్రాక్టర్‌లో ప్రయాణిస్తున్న రెహాన్(2), ఇస్మాయిల్(50) అక్కడికక్కడే చనిపోయారు. నాజియా సుల్తానా, ఫయాజ్, వజేద, ఖాదర్‌బీ, వహీద, అమీన, సర్వర్, హర్షిత్‌లకు గాయా లయ్యాయి. పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని క్షతగాత్రులను ఎంజీఎంకు తరలించారు. కాగా, ప్రమాద సమయంలో స్కూల్ బస్సులో 30 మంది వరకు విద్యార్థులు ఉన్నారు. కేసు




దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ప్రవీణ్ తెలిపారు.

## 'పుర హోరు'కు తెర

-మొదటిపేజీ తరువాయి

వరకు ఎన్నికలు జరిగే ప్రాంతాల్లో మద్యం దుకాణాలను మూసివేయాలని ఎక్సైజ్ శాఖను ఆదేశించారు.

**ఏర్పాట్లపై ఎస్ఈసీ వీడియో కాన్ఫరెన్స్**

రాష్ట్రంలోని 116 మున్సిపాలిటీలు, 7 కార్పొరేషన్ల పరిధిలో బుధవారం పోలింగ్ నేపథ్యంలో రాష్ట్ర ఎన్నికల సంఘం కమిషనర్ రాణీకుముదిని సోమవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. జిల్లా కలెక్టర్లు, ఎన్నికల పరిశీలకులు ఈ ఇందులో పాల్గొన్నారు. ఈ నెల 11న జరగనున్న మున్సిపల్ ఎన్నికలను సజావుగా, ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు డిస్ట్రిబ్యూషన్, రిసెప్షన్ సెంటర్లు అన్ని విధాల సౌకర్యవంతంగా ఉండేలా పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని ఎన్నికల కమిషనర్ ఆదేశించారు. సమర్థవంతమైన కమ్యూనికేషన్ ప్రణాళికతోపాటు ఎలాంటి లోటుపాట్లు లేకుండా పోలింగ్ నిర్వహించేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలన్నారు. డిస్ట్రిబ్యూషన్ సెంటర్ నుంచి బ్యాలెట్ బాక్సులు, బ్యాలెట్ పేపర్లు, పోలింగ్ మెటీరియల్‌తో సిబ్బందిని పోలింగ్ కేంద్రాలకు ఎస్కార్ట్ వాహనంతో మాత్రమే తరలించాలని స్పష్టం చేశారు. పోలింగ్ ముగిసిన తర్వాత బ్యాలెట్ బాక్సులను డీజీటీ వాహనంలో ఎస్కార్ట్ వాహనాలతో మాత్రమే స్ట్రాంగ్ రూములకు తరలించాలన్నారు. డిస్ట్రిబ్యూషన్, రిసెప్షన్ కేంద్రాలలో చేయాల్సిన ఏర్పాట్లు, పోలింగ్ కేంద్రాల వారీగా కౌంటర్ల ఏర్పాటు, పోలింగ్ మెటీరియల్ పంపిణీ, బ్యాలెట్ బాక్సుల నిర్వహణ, రూట్ వారీగా బస్సుల ఏర్పాటు, పోలింగ్‌కు ముందు రోజు కేంద్రాల్లో చేపట్టాల్సిన ఏర్పాట్లు తదితర అంశాలపై ఎన్నికల సంఘం కమిషనర్ పలు సూచనలు చేశారు.

**నేడు పోలింగ్ కేంద్రాలకు సిబ్బంది**

ఈ నెల 11న ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు జరిగే మున్సిపల్ ఎన్నికల పోలింగ్ నిర్వహణకు సిబ్బంది మంగళవారం డిస్ట్రిబ్యూషన్ సెంటర్ల నుంచి బయలుదేరి వెళ్లనున్నారు. 116 మున్సిపాలిటీలు, 7 కార్పొరేషన్లలోని 2,996 వార్డుల్లో 12,993 మంది అభ్యర్థులు బరిలో ఉన్నారు. 123 చోట్ల ఎన్నికల సామగ్రి పంపిణీ కేంద్రాలు ఏర్పాటు చేయగా, పోలింగ్ తర్వాత బ్యాలెట్ బాక్సులను చేర్చేందుకు 137 స్ట్రాంగ్ రూమ్‌లు సిద్ధం చేశారు. ఒకే విడతలో జరిగే ఎన్నికల్లో 20 వేల మంది వివిధ విభాగాలకు చెందిన సిబ్బందితోపాటు సుమారు 25వేల మంది పోలీసులు బందోబస్తులో పాల్గొంటున్నారు. ఈ నెల 13న 136 చోట్ల ఓట్ల లెక్కింపు జరగనుంది. మొత్తం 8,195 పోలింగ్ స్టేషన్ల పరిధిలో 52.43 లక్షల మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు.

## కాంగ్రెస్‌కు మళ్లీ ఓటేస్తే ఆగమే

-మొదటిపేజీ తరువాయి

పరకాల, మహబూబాబాద్ మున్సిపాలిటీలలో కార్నర్ మీటింగ్‌ల ద్వారా ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ ప్రజలకిచ్చిన హామీలు నెరవేర్చడం చేతగాని రేవంత్‌రెడ్డి కేవలం కేసీఆర్‌ను తిట్టడమే లక్ష్యంగా పెట్టుకున్నారని, కేసీఆర్‌ను తిట్టినోళ్లు ఎక్కడ దాక్కున్నా వదిలిపెట్టమని హెచ్చరించారు. తెలంగాణ రాష్ట్రం తెచ్చిన నాయకుడిగా ప్రజల గుండెల్లో చెరగని ముద్ర వేసుకున్న కేసీఆర్ ఆనవాళ్లను చెరిపేయడం ఎవరితరం కాదన్నారు. ఓటుకు నోటు కేసులో ఆధారాలు ఉండకూడదని ఫోరెన్సిక్ ల్యాబ్‌లో నిప్పు పెట్టి తగులబెట్టారని కేటీఆర్ మండిపడ్డారు. తెలంగాణలో మళ్లీ అభివృద్ధి పరుగులు పెట్టాలన్నా.. కాంగ్రెస్ వాళ్లకు బుద్ధి చెప్పాలన్నా 11న జరిగే ఎన్నికల్లో కారు గుర్తుకు ఓటు వేసి బీఆర్ఎస్‌ను గెలిపించాలని ఆయన కోరారు.

**కాంగ్రెస్ గెలిస్తే..జిల్లాలు ఉండవు**

ప్రభుత్వం ప్రజలకు దగ్గరకు చేర్చాలనే ఆలోచనతో గత ముఖ్యమంత్రి కేసీఆర్ మారుమూల మానుకోట, భూపాలపల్లిని జిల్లాలుగా మార్చారు. ప్రజలకు కలెక్టర్, ఇతర అధికారులను దగ్గర చేర్చారు.. కానీ ప్రస్తుత సీఎం రేవంత్ రెడ్డి జిల్లాలు తీసివేస్తారటా.. మున్సిపాలిటీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ గెలిస్తే జిల్లాలుండవు.. ఏది కావాలో ఆలోచించి ప్రజలు ఓటు వేయాలని కేటీఆర్ అన్నారు. వెనకటి రోజులు తెస్తానని చెబుతున్న సీఎం రేవంత్ రెడ్డి మాటలు నిజం చేస్తున్నారన్నారు. వెనకటి రోజులు అంటే యూరియా కోసం చెప్పుల క్యూ పెట్టడమా.. కరెంట్ లేని రాత్రులు గడపడమా.. అని విమర్శించారు. ఆయా కార్యక్రమాల్లో శాసన మండలి డిప్యూటీ చైర్మన్ బండా ప్రకాష్, మాజీ మంత్రి సత్యవతిరాథోడ్, మాజీ ఎమ్మెల్యేలు గండ్ర వెంకటరమణారెడ్డి, దాస్యం వినయ్‌భాస్కర్, శంకర్‌నాయక్, చల్లా ధర్మారెడ్డి, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షురాళ్లు గండ్ర జ్యోతి, మాలోతు కవిత, పాల్గొన్నారు.

**మరుగుజ్జుకు కేటీఆర్ ఆర్థిక హామీ..**

మహబూబాబాద్ మున్సిపాలిటీ ఎన్నికల ప్రచారానికి సోమవారం నర్సంపేట మీదుగా వస్తున్న మాజీ మంత్రి కేటీఆర్.. భీరవెల్లి భరత్ కుమార్‌రెడ్డి కోరిక మేరకు మార్గమధ్యలో గూడూరులోని రెవెన్యూ కార్యాలయానికి సమీపంలో గల ఓ చాయ్ కొట్టు వద్ద ఆగారు. కేటీఆర్ చాయ్ తాగుతూ ఎదురుగా కనిపిస్తున్న ఓ చిన్న బాలుడి లాంటి వ్యక్తిని చూసి దగ్గరికి పిలిచి అతడిని ఎన్ని సంవత్సరాలుంటాయి నీకు అని అడిగాడు. అక్కడే ఉన్న భరత్‌కుమార్‌రెడ్డి 'సార్.. ఇతని పేరు ధారావత్ వినోద్‌కుమార్. 30ఏళ్లు ఉంటాయి. డిగ్రీ చదువుకొని ఇంటి వద్ద ఖాళీగా ఉంటున్నాడు'అని చెప్పాడు. అది విన్న కేటీఆర్ ఏమైనా చిరువ్యాపారం చేసుకుంటావా? అని అతన్ని అడగ్గా, చేసుకుంటా సార్ అన్నాడు. భరత్‌కుమార్‌రెడ్డిని చూపుతూ 'ఇతను నీకు తెలుసా'అని అడగ్గా తెల్సు సార్ అన్నాడు. వెంటనే 'ఈయనకు రూ.2లక్షలు పంపిస్తా.. నీకు ఇస్తాడు. ఇంటి వద్ద ఏదైనా కిరాణం పెట్టుకో'అన్నాడు.

## కొంటున్నారా? కుమ్మక్కు అవుతున్నారా?

హైదరాబాద్

థర్మల్ విద్యుత్ ప్లాంట్లలో వాడే రసాయనాల లెక్కలు తప్పుతున్నాయి. అధికారులు అవసరానికి మించి వాటిని కొనుగోలు చేస్తుండటంతోపాటు వాడకుండానే వాటిని గడువు తీరిందని భూస్థాపితం చేస్తున్నారు. దీనివల్ల థర్మల్ విద్యుత్ ప్లాంట్లకు ఏటా రూ. కోట్లలో నష్టం వాటిల్లుతోంది. దీనిపై నియంత్రణ ఉండాలని కేంద్ర విద్యుత్ నియంత్రణ మండలి (సీఈఆర్సీ) అన్ని రాష్ట్రాల విద్యుదుత్పత్తి కేంద్రాలకు సూచించింది. అలాగే ఈ వ్యవహారంపై రాష్ట్రాల రెగ్యులరేటరీ కమిషన్లు కూడా దృష్టి పెట్టాలని కోరింది. అవసరం లేకున్నా ఎందుకు కొంటున్నారు? అసలు కొంటున్నారా లేక కేవలం లెక్కల్లో చూపిస్తున్నారా? అనే విషయాలు తెలియట్లేదని పేర్కొంది. విద్యుత్ అధికారులు మాత్రం ఈ విషయంలో భిన్న వాదన వినిపిస్తున్నారు. ఉత్పత్తి చేస్తామనే లక్ష్యంతో రసాయనాలు కొనుగోలు చేస్తున్నామంటున్నారు. మార్కెట్లో చౌక విద్యుత్ లభించడం వల్ల జెన్‌కో ప్లాంట్లను బ్యాకింగ్ డౌన్ (ఉత్పత్తి తగ్గించడం) చేస్తున్నామని చెబుతున్నారు. ఈ కారణంగానే రసాయనాలు నిరుపయోగమవుతున్నాయని చెబుతున్నారు.

**ఇవీ వాడే రసాయనాలు**

బొగ్గు ఆధారిత థర్మల్ విద్యుత్ కేంద్రాల్లో బాయిలర్‌లోకి పంపే నీళ్లు అత్యంత స్వచ్ఛంగా ఉండాలి. నీళ్లల్లో మలినాల తొలగింపునకు అలమ్, ఫెర్రిక్ క్లోరైడ్ వాడతారు. నీటి కాఠిన్యం తొలగించేందుకు లైమ్, కాఠిన్య నియంత్రణకు సోడియం కార్బొనేట్, క్రిములను తొలగించేందుకు హైడ్రోక్లోరిక్ ఆమ్లం వంటివి వాడతారు. బాయిలర్ ట్యూబుల్లో తుప్పు రాకుండా ఫాస్పేట్లు, హైడ్రోజన్, అమోనియా, ఆంటీఫోమింగ్ ఏజెంట్లు వాడతారు. కండెన్సర్ పైపుల్లో ఫౌలింగ్ (వ్యర్థ పదార్థాలు పేరుకుపోవడం) రాకుండా బయోసైడ్లు, కాల్షియం డిపాజిట్లు తగ్గించేందుకు స్కేల్ ఇన్హిబిటర్లు, పైపుల రక్షణకు కరోషన్ ఇన్హిబిటర్లు (తుప్పు నిరోధక రసాయనాలు), సల్ఫ్యూరిక్ ఆమ్లం వాడతారు. థర్మల్ కేంద్రాల్లో బూడిద పెరగకుండా ఉండేందుకు డస్ట్ సప్రెషన్ కెమికల్స్ అవసరం. వాయు కాలుష్య నియంత్రణకు లైమ్, ఆక్టివేటెడ్ కార్బన్ వంటివి వాడాలి. థర్మల్ ప్లాంట్ సామర్థ్యాన్ని బట్టి ఏడాదికి ఎంత అవసరమో ముందే అంచనా వేస్తారు. ఆ మొత్తాన్ని కాంట్రాక్టు సంస్థలకు ఆర్డర్ ఇస్తారు. ఏ నెలలో ఏ కెమికల్ అందించాలో ముందే చెబుతారు. అనుకున్న ప్రకారం తీసుకోకపోతే జెన్‌కో కాంట్రాక్టు సంస్థకు పరిహారం చెల్లించాలి. ఒక వేళ అనుకున్న ప్రకారం అందించకపోతే కాంట్రాక్టు సంస్థకు జరిమానా విధిస్తారు. అయితే, ఫైన్ వేసే కన్నా ముందే కొనుగోలు చేయడం వల్ల ఉత్పత్తి సమయంలో ఇబ్బంది ఉండదని అధికారులు భావిస్తున్నారు.

# లోక్‌సభ స్పీకర్‌పై అవిశ్వాస తీర్మానం!

దిల్లీ

లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లాపై అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టేందుకు విపక్షాలు రంగం సిద్ధం చేస్తున్నాయి. ఇప్పటికే 103 మంది ఎంపీల సంతకాలు సేకరించినట్లు సమాచారం. రాష్ట్రపతికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై చర్చలో మాట్లాడేందుకు విపక్ష నేత రాహుల్‌గాంధీకి అవకాశం ఇవ్వకపోవడం, ఎనిమిది మంది సభ్యులపై సస్పెన్షన్ వేటు వేయడం, కాంగ్రెస్ మహిళా ఎంపీలపై నిరాధార ఆరోపణలు చేసిన భాజపా ఎంపీ నిశికాంత్ దుబెపై చర్యలు చేపట్టకపోవడం వంటి కారణాలతో ఈ డిమాండును విపక్షాలు తెరపైకి తీసుకువస్తున్నాయి. రాజ్యసభ విపక్ష నేత మల్లికార్జున ఖర్గే కార్యాలయంలో సోమవారం జరిగిన సమావేశంలో.. తృణమూల్, డీఎంకే, వామపక్షాలు, సమాజ్‌వాదీ పార్టీ, ఆర్జేడీ, శివసేన (యూబీటీ), ఎన్సీపీ (ఎస్పీ) తదితర పార్టీలు పాల్గొని ఈ నిర్ణయానికి వచ్చాయి. లోక్‌సభ సెక్రటరీ జనరల్‌కు దీనిని ఎప్పుడు సమర్పించాలో మంగళవారం నిర్ణయిస్తారు.

పార్లమెంటు హౌస్‌లో భేటీ అయిన కాంగ్రెస్ నేతలు మల్లికార్జున ఖర్గే, రాహుల్‌గాంధీ, జైరాం రమేశ్, శివసేన(యూబీటీ) నేత సంజయ్ రౌత్, డీఎంకే ఎంపీ తిరుచ్చి శివ తదితరులు

..వీటిపై మాట్లాడనివ్వండి

రాహుల్, మరికొందరు విపక్ష ఎంపీలు సోమవారం ఓం బిర్లాతో సమావేశమయ్యారు. సభలో ప్రతిష్టంభన తొలగింపుపై చర్చించారు. రాహుల్ తాను లేవనెత్తదలచిన అంశాలను వివరించారు. వాటిపై మాట్లాడనిస్తే చర్చకు సిద్ధమేనని చెప్పారు. రాహుల్ వెంట వెళ్లిన విపక్ష నేతల్లో టీఎంసీ నేత అభిషేక్ బెనర్జీ, డీఎంకే నేత టి.ఆర్.బాలు, సమాజ్‌వాదీ పార్టీ చీఫ్ అఖిలేశ్ యాదవ్ ఉన్నారు. వారు వేర్వేరు అంశాలను లేవనెత్తారు. ప్రభుత్వంతో మాట్లాడి చెబుతానని స్పీకర్ వారికి తెలిపారు. రాహుల్ ఒక్కరే మాట్లాడి మిగిలినవారికి అవకాశం కల్పించకపోతే కుదరదని ప్రభుత్వం పేర్కొంటోంది. ఎంపీల నుంచి ప్రధానికి ముప్పు ఉన్నట్లయితే వారిపై ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని రాహుల్ విలేకరులకు చెప్పారు. తాను సభలో ఏం చెబుతానోననే భయంలో ప్రధాని ఉన్నారని, నిజాన్ని ఎదుర్కొనే ధైర్యం ఆయనకు లేదని ఎద్దేవా చేశారు. నరవణె పుస్తకాన్ని తాను ఇస్తానని మోదీ భయపడిపోతున్నారని చెప్పారు.

**'స్పీకర్ సొంతంగా నిర్ణయాలు తీసుకోలేకపోతున్నారు'**

స్పీకర్‌పై అధికారపార్టీ ఒత్తిడి ఉందని, ఆయన సొంత నిర్ణయాలు తీసుకోలేకపోతున్నారని కాంగ్రెస్ మహిళా ఎంపీలు ఆరోపించారు. ఆయనను ఉద్దేశించి ఈ మేరకు లేఖ రాశారు. "సభకు ప్రధాని మోదీ గైర్హాజరు కావడాన్ని సమర్థించే క్రమంలో, మీరు అధికార పార్టీ ఒత్తిడి మేరకు మాపై నిరాధార ఆరోపణలు చేశారు. ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తున్నందుకే మమ్మల్ని లక్ష్యంగా చేసుకుంటున్నారు. సభకు నిష్పక్షపాత సంరక్షకుడిగా మీరు వ్యవహరించాలి" అని వారు ఓం బిర్లాను కోరారు. లేఖపై ప్రియాంకా గాంధీ సహా పలువురు సంతకాలు చేశారు.

**ఆ పదవిపై గౌరవం ఉంది**

"మాజీ ప్రధానులపై అసభ్యకరంగా మాట్లాడిన భాజపా ఎంపీలపై మీరు ఎలాంటి చర్య తీసుకోలేదు. మీరు స్వతంత్ర నిర్ణయాలు తీసుకోలేకపోతున్నారని అర్థమవుతోంది. మీపై మాకు వ్యక్తిగతంగా గౌరవం ఉంది. మీరు నిరంతరం అధికార పార్టీ ఒత్తిడిలో ఉంటున్నారు" అని మహిళా ఎంపీలు లేఖలో పేర్కొన్నారు. 'మేం సభకు వెళ్లడం, వెంటనే బయటకు రావడం చాలా విచారకరం. ఇది ప్రజాస్వామ్యం కాదు. మేం ఇక్కడికి ఎందుకు వస్తున్నట్లు?' అని ప్రియాంక విలేకరుల వద్ద అన్నారు.

**రాజ్యసభ నుంచి విపక్షం వాకౌట్**

పార్లమెంటులో సోమవారం కూడా సభా కార్యకలాపాలకు ఆటంకం కలిగింది. విపక్షాల నిరసనలతో లోక్‌సభ పలుమార్లు వాయిదా పడింది. రాహుల్‌ను మాట్లాడనివ్వాలనే డిమాండులో సభను విపక్షం స్తంభింపజేసింది. ఇరుపక్షాలూ తమతమ వాదనలు వినిపించాయి. చివరకు సభ మంగళవారానికి వాయిదా పడింది. అటు రాజ్యసభలో ఇదే అంశంపై ఖర్గే మాట్లాడటానికి అనుమతి లభించకపోవడంతో కాంగ్రెస్ సహా విపక్షాలు వాకౌట్ చేశాయి. వాణిజ్య శాఖ మంత్రి పీయూష్ గోయల్‌పై డీఎంకే ఎంపీ తిరుచ్చి శివ.. సభాహక్కుల తీర్మాన నోటీసు ఇచ్చారు. పార్లమెంటు జరుగుతున్నప్పుడు అమెరికా వాణిజ్య ఒప్పందంపై బయట ప్రకటన చేయడాన్ని తప్పుబట్టారు.

**చర్చ జరగకపోతే విపక్షానికే నష్టం**

సభలో సంఖ్యాబలం తమకున్న దృష్ట్యా ఏ బిల్లునైనా ఆమోదించుకోవడంలో ఇబ్బంది ఉండదని, చర్చ జరగకపోతే ప్రతిపక్షానికే నష్టమని పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు పేర్కొన్నారు. స్పీకర్‌పై అవిశ్వాసం ప్రవేశపెట్టినా ఆయన్ని తొలగించడానికి కావాల్సినంత బలం విపక్షాలకు లేదని చెప్పారు. స్పీకర్ వ్యవస్థను కించపరిచేలా విపక్షం వ్యవహరిస్తోందని ఆరోపించారు. సభలో ప్రధాని భద్రతపై స్పీకర్ ఆందోళన చెందడానికి తగిన కారణాలు ఉన్నాయని, వ్యవస్థ పవిత్రతను కాపాడేందుకే ఆయన నిర్ణయాలు తీసుకున్నారని లోక్‌సభ సచివాలయం స్పష్టంచేసింది.

# డిజిటల్ మోసాల కేసులను ఎదుర్కోవడానికి ఎస్ఓపీని రూపొందించండి

దేశంలో డిజిటల్ మోసాల ద్వారా రూ.54వేల కోట్లకు పైగా సొమ్ము దోపిడీకి గురికావడంపై సుప్రీంకోర్టు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. ఇది ముమ్మాటికీ "పచ్చి దోపిడీ, డెకాయిటీ" అని వ్యాఖ్యానించింది. ఇలాంటి కేసులను ఎదుర్కోవడానికి ఆర్‌బీఐ, బ్యాంకులు, టెలికాం శాఖలతో సంప్రదించి, ఒక పక్కా 'స్టాండర్డ్ ఆపరేటింగ్ ప్రొసీజర్' (ఎస్ఓపీ) రూపొందించాలని కేంద్రాన్ని ఆదేశించింది.



**చిన్న రాష్ట్రాల బడ్జెట్ కంటే ఎక్కువే!**

సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్‌మాల్య బాగ్చీ, జస్టిస్ ఎన్‌వీ అంజారియాలతో కూడిన ధర్మాసనం సుమోటోగా ఈ కేసు విచారణను చేపట్టింది. "బ్యాంకులు కేవలం లాభాపేక్షతో, వ్యాపార ధోరణిలో ఉండి, నేరగాళ్లు సులభంగా దోపిడీ సొమ్మును తరలించడానికి వేదికలుగా మారుతున్నాయి" అని జస్టిస్ బాగ్చీ అన్నారు. 2021 ఏప్రిల్ నుంచి 2025 నవంబర్ మధ్య మన దేశంలో ఏకంగా రూ.52వేల కోట్ల సైబర్ మోసాలు జరిగినట్లు హోంశాఖ నివేదిక పేర్కొన్న విషయాన్ని ఆయన ఈ సందర్భంగా గుర్తు చేశారు. ఇది 'అనేక రాష్ట్రాల వార్షిక బడ్జెట్ కంటే ఇది చాలా ఎక్కువ మొత్తం' అని సీజేఐ సూర్యకాంత్ అన్నారు. కాగా, ఈ డిజిటల్ మోసాలు బ్యాంకు అధికారుల నిర్లక్ష్యం వల్ల లేదా నేరగాళ్లతో సహకరించడం వల్ల జరిగి ఉండవచ్చని ధర్మాసనం అనుమానం వ్యక్తం చేసింది. డిజిటల్ అరెస్టుల పట్ల ఆర్‌బీఐ, బ్యాంకులు సకాలంలో స్పందించాల్సిన అవసరం ఉందని నొక్కి చెప్పింది.

**సుప్రీంకోర్టు ఆదేశాలు**

ఆర్‌బీఐ, టెలికాం శాఖ రూపొందించిన నిబంధనలను పరిగణనలోకి తీసుకుని, ఈ నేరాలను సమర్థవంతంగా అరికట్టడానికి నాలుగు వారాల్లోగా ఒక ముసాయిదా ఒప్పందాన్ని సిద్ధం చేయాలని హోం మంత్రిత్వ శాఖను సర్వోన్నత న్యాయస్థానం ఆదేశించింది. అలాగే దేశవ్యాప్తంగా నమోదైన డిజిటల్ అరెస్ట్ కేసులను గుర్తించాలని సీబీఐని ఆదేశించింది. అలాగే, ఈ కేసుల్లో విచారణ జరిపేందుకు సీబీఐకి అవసరమైన అనుమతులను వెంటనే మంజూరు చేయాలని దిల్లీ, గుజరాత్ ప్రభుత్వాలకు స్పష్టం చేసింది. డిజిటల్ అరెస్ట్ బాధితులకు పరిహారం అందించే విషయంలో ఉదారంగా, ఆచరణాత్మక దృక్పథంతో వ్యవహరించాలని సుప్రీంకోర్టు సూచించింది. పరిహారం చెల్లింపుపై ఒక ఫ్రేమ్‌వర్క్ సిద్ధం చేయడానికి ఆర్‌బీఐ, టెలికాం శాఖ సంయుక్తంగా సమావేశం కావాలని ఆదేశించింది.

**బ్యాంకులపై ధర్మాసనం ఆగ్రహం**

సైబర్ మోసాల నివారణలో బ్యాంకులు క్రియాశీలక పాత్ర పోషించాలని సుప్రీంకోర్టు పేర్కొంది. "కోట్లాది రూపాయల టర్నోవర్ ఉన్న వ్యాపార సంస్థల ఖాతాల్లో భారీ లావాదేవీలు జరిగితే అనుమానం రాకపోవచ్చు. కానీ కేవలం రూ.15-20 వేల పెన్షన్ తీసుకునే వ్యక్తి ఖాతా నుంచి ఒక్కసారిగా రూ.50 లక్షలు లేదా కోటి రూపాయలు విత్‌డ్రా అవుతుంటే, మీ ఏఐ టూల్స్ ఎందుకు అలర్ట్ చేయడం లేదు?" అని సీజేఐ సూర్యకాంత్ ప్రశ్నించారు.

**ఏఐ వాడండి!**

ఈ కేసులో అమికస్ క్యూరీగా ఉన్న సీనియర్ అడ్వకేట్ ఎన్.ఎస్.నప్పినై తన వాదనలు వినిపిస్తూ, "అనుమానాస్పద లావాదేవీలను గుర్తించడానికి బ్యాంకులు కృత్రిమ మేధ (ఏఐ)ని ఉపయోగించాలి" అని సూచించారు. కేవలం ఆర్‌బీఐ సర్క్యులర్లు జారీ చేస్తే సరిపోదని, నిబంధనలు పాటించని బ్యాంకులపై జరిమానాలు విధిస్తేనే ఫలితం ఉంటుందని ఆమె అన్నారు.

**డిజిటల్ అరెస్ట్ అంటే ఏమిటి?**

డిజిటల్ అరెస్ట్ అనేది ప్రస్తుతం వేగంగా విస్తరిస్తున్న ఒక సైబర్ నేరం. ఇందులో నేరగాళ్లు తాము పోలీస్ ఆఫీసర్లమని, కోర్టు లేదా ప్రభుత్వ అధికారలమంటూ బాధితులను నమ్మిస్తారు. ఆడియో లేదా వీడియో కాల్స్ ద్వారా బాధితులను బెదిరించి, వారిని గృహ నిర్బంధంలో ఉన్నట్లు భ్రమ కలిగిస్తారు. తీవ్రమైన ఒత్తిడికి గురిచేసి వారి నుంచి భారీ మొత్తంలో డబ్బు వసూలు చేస్తారు.

# ఆర్ఎస్ఎస్ వల్లే బీజేపీకి 'అచ్ఛే దిన్'

దేశంలో బీజేపీ అప్రతిహత విజయాలకు ఆర్ఎస్ఎస్ విధానాలే కారణమని, సంఘ్ వల్లే బీజేపీకి అచ్ఛే దిన్ వచ్చాయని మోహన్ భగవత్ వ్యాఖ్యానించారు. ఈ మేరకు ఆర్ఎస్ఎస్ శతాబ్ది ఉత్సవాల్లో భాగంగా ముంబైలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. కేంద్రంలో బీజేపీ అధికారంలో ఉండడంతో ఆర్ఎస్ఎస్ కు అచ్ఛే దిన్ వచ్చాయన్న వ్యాఖ్యలపై భగవత్ స్పందించారు. నిజానికి బీజేపీ అధికారంలోకి రావడానికి, ఆ పార్టీకి మంచి రోజులు రావడానికి కారణం ఆర్ఎస్ఎస్ అని చెప్పారు. అయోధ్యలో రామాలయం నిర్మాణం విషయంలో సంఘ్ పట్టుదలగా వ్యవహరించడం, ఈ ఉద్యమానికి సహకరించిన పార్టీలకు ప్రయోజనం కలిగిందని పేర్కొన్నారు. దీంతోపాటు స్వయంసేవకుల కఠోర శ్రమ కూడా ఉందని భగవత్ స్పష్టం చేశారు.

**సావర్కర్‌కు భారతరత్నపై..**

హిందూత్వ సిద్ధాంతకర్త వీర్ సావర్కర్‌కు 'భారతరత్న' ఇవ్వాలనే డిమాండ్‌పై భగవత్ స్పందించారు. అవార్డు



కమిటీలో తాను లేనని చెబుతూ.. ఆ కమిటీలో ఉన్న వారిని కలిస్తే ఈ విషయం తప్పకుండా ప్రస్తావిస్తానని చెప్పారు. నిజానికి సావర్కర్ కు భారతరత్న ఇస్తే ఆ అవార్డుకే ఖ్యాతి పెరుగుతుందని చెప్పారు. ఎలాంటి పురస్కారాలు పొందకున్నా కూడా సావర్కర్ కోట్లాది భారతీయుల హృదయాల్లో చక్రవర్తిగా నిలిచారని భగవత్ కొనియాడారు.

**ఉపాధి కల్పనపై..**

భారత ఆర్థిక వ్యవస్థ బలోపేతం కావడానికి 'మాస్ ప్రొడక్షన్' (భారీ ఉత్పత్తి) కంటే 'ప్రొడక్షన్ బై మాసెస్' (ప్రజల భాగస్వామ్యంతో ఉత్పత్తి) జరగాలని భగవత్ పిలుపునిచ్చారు. ఒకేచోట భారీగా ఉత్పత్తి చేయడం కంటే ఎక్కువ చోట్ల చిన్న తరహా ఉత్పత్తి జరిపితే వస్తువుల ధరలు తగ్గుతాయని చెప్పారు. అప్పుడు కంపెనీల మధ్య పోటీ ధరలపై కాకుండా వస్తువుల నాణ్యతపైకి మారుతుందని వివరించారు. నాణ్యత బాగుండేలా జాగ్రత్త పడితే మన వస్తువులకు విదేశాల్లోనూ డిమాండ్ పెరుగుతుందని తెలిపారు.

**ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ పై..**

మారుతున్న కాలానికి అనుగుణంగా ఆధునిక సాంకేతికతలను స్వాగతించాల్సిన అవసరం ఉందని మోహన్ భగవత్ చెప్పారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ వంటి వాటిపై పట్టు సాధించాలని సూచించారు. అయితే, టెక్నాలజీ అనేది ఉద్యోగాలను హరించేదిగా ఉండకూడదని, ఉపాధికి భంగం కలగకుండా ఏఐని ఎలా ఉపయోగించుకోవాలో మనం నేర్చుకోవాలని ఆయన హితవు పలికారు.

## సాంకేతికతకు సాగిలపడొద్దు

న్యూఢిల్లీ

సాంకేతికత అనేది విద్యార్థులను బానిసలుగా మార్చుకునే పరిస్థితి తెచ్చుకోవద్దని విద్యార్థులను ప్రధాని నరేంద్ర మోదీ అప్రమత్తంచేశారు. విద్యార్థి దశలో శిక్షణలో భాగంగా నేర్చుకునే పరంపరను కొనసాగించాలనీ అన్నింటిపై కృత్రిమ మేధ మీద ఆధారపడొద్దని ఆయన హితవు పలికారు. దేశవ్యాప్తంగా వివిధ రాష్ట్రాల విద్యార్థులకు విద్యా సంబంధ చిట్కాలు, సలహాలు చెబుతూ అత్యంత ప్రజాదరణతో కొనసాగుతున్న 'పరీక్షా పే చర్చా'కార్యక్రమం 9వ విడత రెండో ఎపిసోడ్ సందర్భంగా కోయంబత్తూర్, రాయ్‌పూర్, గువాహటి, గుజరాత్‌లకు చెందిన పలువురు ఔత్సాహిక విద్యార్థులతో ప్రధాని మోదీ ముచ్చటించారు. వాళ్లు అడిగిన ప్రశ్నలకు తనదైన శైలిలో సమాధానం చెప్పారు.

**ఏఐ అంటే భయమేల?**

"కృత్రిమ మేధ(ఏఐ) వంటి కొత్త తరం సాంకేతికతలను చూసి విద్యార్థులు భయపడొద్దు. ఆధునిక సాంకేతికతలను అందిపుచ్చుకుంటూ వాటిలోనూ మీరు రాణించాలి. ఏఐ లేదా స్మార్ట్‌ఫోన్‌ను అత్యున్నత గురువుగా భావించొద్దు. కొందరు పిల్లలకు తొలుత స్మార్ట్‌ఫోన్‌లో ఏదైనా చూశాకే వాళ్ల నోట్లోకి ముద్ద దిగుతుంది. మనం ఏఐను ప్రభావవంతంగా వినియోగించుకోవాలి. అంతేగానీ అదే మన మార్గదర్శి అనే స్థాయిలో దానికి విలువ ఇవ్వొద్దు. పాఠ్యపుస్తకాల్లో ఉన్నదానికి ఏఐ సమాచారం అనేది అదనపు విలువ జోడింపు ఇస్తుంది అనే భావనతోనే మెలగాలి. అంతేగానీ నేర్చుకోవడం మానేసి పూర్తిగా ఏఐ ఆధారపడొద్దు. గతంలో ఎడ్లబండి మీద వెళ్లిన మనం ఇప్పుడు ఏరోప్లేన్‌లో వెళ్లినట్లుగా పాతరకం ఉద్యోగాలు మటుమాయమై ఎల్లప్పుడూ కొత్త రకం ఉద్యోగాలు పుట్టుకొస్తూనే ఉంటాయి. ఉపాధి మారొచ్చేమోగానీ జీవితం మారదు. కొనసాగుతూనే ఉంటుంది. భయం, జంకూ వీడి కొత్త రకం సాంకేతికతలను నేర్చుకోవాలి. వాటిపై పట్టుసాధించాలి. సాంకేతికతతో మీ శక్తిసామర్థ్యాలను మరింత పెంపొందించుకోండి. సాంకేతికత సత్తాను మీ పనిలో చూపించండి"అని మోదీ సూచించారు.

**పాతవి తిరగేయండి.. హాయిగా నిద్రపోండి**

"పరీక్షలకు సంబంధించి పాత క్వశ్చన్ పేపర్లను తిరగేయండి. ప్రశ్నల తీరును అర్థంచేసుకోండి. పగలంతా పక్కా ప్రణాళికతో చదివేసి రాత్రి హాయిగా నిద్రపోండి. రాత్రి బాగా నిద్రపోతేనే ఉదయం అంతకంటే బాగా పరీక్ష రాయగల్గుతారు. పరీక్షకు బాగా సంసిద్ధమయ్యాక కొత్తగా ఆందోళన చెందాల్సిన అవసరమే లేదు. చక్కటి నిద్ర అనేది మిమ్మల్ని రోజంతా హుషారుగా ఉండేలా చేస్తుంది"అని అన్నారు. తమ పిల్లలను ఇతర విద్యార్థులతో పోల్చి చూసే ధోరణిని తల్లిదండ్రులు విడనాడాలని మోదీ సూచించారు.

**రెండింటిపై స్వారీ చేయండి**

విద్య, సొంత ఇష్టాయిష్టాలను సమన్వయం చేసుకోవడం కష్టంగా ఉందని ఓ విద్యార్థి వెలిబుచ్చిన ఆవేదనపై మోదీ తనదైన శైలిలో సలహా ఇచ్చారు. "ఓ వైపు ఆర్ట్ అంటే ఇష్టం. మరోవైపు శాస్త్రసాంకేతిక రంగంలో రాణించాల్సిన పరిస్థితి. ఇలాంటి సందర్భాల్లో ఏం చేయాలో ఎటూపాలుపోక నిట్టూర్చేకంటే ప్రతి రోజూ లేదా వారానికి ఒకసారి సొంత ఇష్టాయిష్టాలపై దృష్టిపెట్టండి. విద్యకు ఎప్పట్లాగే అత్యంత ప్రాధాన్యతా ఇవ్వండి"అని సూచించారు. అంకుర సంస్థల వైపు మొగ్గుచూపొచ్చా? అని మరో విద్యార్థి అడగ్గా.."ముందు అసలు మీరు ఏం చేయాలనుకుంటున్నారో ఒక స్పష్టతకు రావాలి.

ఇప్పటికే ఉన్న సాంకేతికతలో నూతన ఆవిష్కరణలు చేయదలిచారా? లేదంటే డ్రోన్లు, విద్యుత్ వ్యవస్థల వంటి వాటికి కొత్త పరిష్కారాలు వెతకాలనుకుంటున్నారా? దీంట్లో స్పష్టత వస్తే అంకురసంస్థను స్థాపించాలా వద్దా అనేది తేలిపోతుంది. ముందుగా సాంకేతికత లేదా ఆర్థిక రంగాలపై పట్టున్న స్నేహితులతో ఒక బృందంగా ఏర్పడండి. స్టార్టప్‌ను ఆరంభించడానికి వయసుతో పనేలేదు. నిజంగా మీకు దీనిపై ఉత్సుకత ఉంటే ఇప్పటికే ఉన్న అంకురసంస్థలను సందర్శించండి. మీకున్న పరిజ్ఞానంతో ఒక ప్రాజెక్ట్ రిపోర్ట్‌ను సిద్ధంచేయండి. అది బాగుంటే అందరినోటా పడి చివరకు భారీ మద్దతు లభిస్తుంది. ఆర్థికసాయమూ అందుతుంది. తర్వాత ఎలా ముందుకెళ్లాలనేది నిర్ణయించుకోవచ్చు"అని మోదీ సూచించారు.

## తొలి ఎన్నికల బరిలో విజయ్..

నటుడు, తమిళగ వెట్రి కజగం (టీవీకే) అధ్యక్షుడు విజయ్ తన రాజకీయ అరంగేట్రానికి పక్కా ప్రణాళికతో సిద్ధమవుతున్నారు. రాబోయే తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల్లో ఆయన రెండు నియోజకవర్గాల నుంచి పోటీ చేయాలని నిర్ణయించినట్లు తెలుస్తోంది. చెన్నైలోని విరుగంబాక్కం, మధ్య తమిళనాడులోని తిరుచ్చి తూర్పు స్థానాల నుంచి ఆయన బరిలోకి దిగనున్నట్లు పార్టీ వర్గాలు వెల్లడించాయి. ఇది పార్టీ విస్తరణతో పాటు వ్యవస్థాపకుడైన విజయ్‌కు బలమైన ఆరంభం ఇచ్చేందుకు రూపొందించిన వ్యూహమని టీవీకే నేతలు చెబుతున్నారు. చెన్నైలోని విరుగంబాక్కం నియోజకవర్గం పట్టణ ఓటర్లు, మొదటిసారి ఓటు వేయనున్న యువతలో విజయ్‌కు మంచి ప్రచారం కల్పిస్తుందని అంచనా వేస్తున్నారు. మరోవైపు తిరుచ్చి తూర్పు నుంచి పోటీ చేయడం ద్వారా పార్టీ కేవలం చెన్నైకే పరిమితం కాదనే సంకేతాన్ని రాష్ట్రవ్యాప్తంగా పంపాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. వాస్తవానికి వెలచ్చేరి, విక్రవాండి, నాగపట్టణం వంటి నియోజకవర్గాలను కూడా పరిశీలించినా, ఓటర్లతో ఉన్న పరిచయం, క్షేత్రస్థాయిలో పార్టీ సన్నద్ధత ఆధారంగా విరుగంబాక్కం, తిరుచ్చి తూర్పు స్థానాలను ఖరారు చేసినట్లు సమాచారం. విజయ్ తొలిసారి ఎన్నికల్లో పోటీ చేస్తుండటం, అధికార డీఎంకే బలంగా ఉండటంతో గెలుపు అవకాశాలను పెంచుకునేందుకే రెండు చోట్ల పోటీ చేయాలనే జాగ్రత్తతో కూడిన నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. ప్రస్తుతం విరుగంబాక్కం, తిరుచ్చి తూర్పు నియోజకవర్గాలకు డీఎంకే ఎమ్మెల్యేలు ఏ.ఎం.వి. ప్రభాకర రాజా, ఇనిగో ఎస్. ఇరుదయరాజ్ ప్రాతినిధ్యం వహిస్తున్నారు. దీంతో ఈ రెండు చోట్లా పోటీ ఆసక్తికరంగా మారనుంది. త్వరలోనే విజయ్ తన ప్రచార వ్యూహాలను ప్రకటించి, బహిరంగ సభలను ముమ్మరం చేయనున్నారు.

## ఎస్ఐఆర్ ప్రక్రియకు అడ్డంకులు రానివ్వం

బంగాల్‌లో ఓటర్ల జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియపై నెలకొన్న వివాదాల వేళ సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. ఎస్ఐఆర్ ప్రక్రియను ఎవరూ అడ్డుకోవడానికి అనుమతించబోమని, ఎన్నికల ప్రక్రియకు ఆటంకం కలిగించే చర్యలు సహించబోమని అత్యున్నత న్యాయస్థానం హెచ్చరించింది. ఆ విషయంలో అవసరమైతే తగిన ఆదేశాలు జారీ చేస్తామని పేర్కొంది. సీజేఐ జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్‌మాల్య బాగ్చి, జస్టిస్ ఎన్‌వీ అంజారియా నేతృత్వంలోని ధర్మాసనం సోమవారం విచారణ చేపట్టింది. బంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ సహా పలువురు దాఖలు చేసిన పిటిషన్లపై కోర్టు విచారణ జరిపింది. ఎస్ఐఆర్ ప్రక్రియ కారణంగా పెద్ద ఎత్తున ఓటర్ల పేర్లు తొలగించే ప్రమాదం ఉందని, అర్హులైన ఓటర్లు తమ హక్కు కోల్పోయే అవకాశముందని పిటిషనర్లు ఆందోళన వ్యక్తం చేశారు. ముఖ్యంగా భారీగా ఓట్ల తొలగింపు జరగొచ్చన్న అభిప్రాయాన్ని కోర్టు దృష్టికి తీసుకువచ్చారు. దీంతో స్పందించిన సీజేఐ, ఎస్ఐఆర్ ప్రక్రియకు ఎటువంటి అడ్డంకి రానివ్వమని, ఇది రాష్ట్రాలన్నీ గమనించాలని స్పష్టం చేశారు. విచారణ సందర్భంగా ఎన్నికల సంఘం (ఈసీ) సమర్పించిన అఫిడవిట్‌ను కోర్టు పరిశీలించింది. ఎన్నికల అధికారులు జారీ చేసిన నోటీసులను కొందరు దుండగులు కాల్చివేశారని ఈసీ ఆరోపించింది. ఇప్పటివరకు ఆ ఘటనపై ఎఫ్ఐఆర్ నమోదు కాలేదని కూడా తెలిపింది. దీనిపై అసంతృప్తి వ్యక్తం చేసిన సుప్రీంకోర్టు, వెంటనే చర్యలు తీసుకోవాలని ఆదేశించింది. ఆ విషయంపై వివరాలతో అఫిడవిట్ దాఖలు చేయాలని బంగాల్ డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ (డీజీపీ)కు కోర్టు స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది. కేంద్ర ప్రభుత్వ తరఫున వాదించిన సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా మాట్లాడుతూ, "భారత రాజ్యాంగం దేశంలోని అన్ని రాష్ట్రాలకు సమానంగా వర్తిస్తుంది. ఎన్నికల ప్రక్రియను ఎవరూ దెబ్బతీయకూడదు" అని తెలిపారు. ఎన్నికల నిర్వహణకు సహకారం అందించాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వాలపై ఉందని ఆయన పేర్కొన్నారు. ఇక, ఎస్ఐఆర్ ప్రక్రియలో సహాయంగా ఉపయోగించేందుకు బంగాల్ ప్రభుత్వం 8,505 గ్రూప్-బి అధికారుల జాబితాను ఎన్నికల సంఘానికి అందజేసింది. వీరికి శిక్షణ ఇచ్చి అవసరమైన చోట వినియోగించవచ్చని కోర్టు సూచించింది.

## సంపాదకీయం

# సుప్రీం తీర్పు.. టీచర్స్‌పై ప్రభావం


2011 కంటే ముందు ఉపాధ్యాయులుగా చేరిన వారికి రెండు సంవత్సరాల లోపు టెట్ పరీక్షను ఉత్తీర్ణత సాధించాలని లేకుంటే ఉద్యోగాన్ని వదులుకోవాల్సి వస్తుందని దేశ అత్యున్నత న్యాయస్థానం తీర్పు ఇచ్చిన నేపథ్యంలో ఇన్ సర్వీస్ ఉపాధ్యాయులు తీవ్ర ఒత్తిడికి, మానసిక సంఘర్షణకు గురవుతున్నారు. తెలంగాణ లోని ప్రభుత్వ, పంచాయతీ రాజ్, ఎయిడెడ్, ఇతర పాఠశాలలలో పనిచేసే టీచర్స్ ఎలిజిబుల్ టెస్ట్ (టెట్)తో భయాందోళనకు గురవుతున్నారు. సుప్రీంకోర్టు 31 ఆగస్టు, 2025 న ప్రతి ఒక్క టీచర్ టెట్ ఉత్తీర్ణత సాధించాలని లేదా ఉద్యోగం వదులుకోవాల్సి వస్తుందని ఉత్తర్వులు జారీ చేయడంతో రాష్ట్ర ప్రభుత్వం ఏ రకమైన విధానం అనుసరిస్తుందో అని టీచర్స్ ఎదురుచూస్తున్నారు. 2009లో విద్యా కమిషన్ వచ్చిన తర్వాత 2010 నుండి టెట్ అమలులోకి వచ్చింది. టెట్ అమలులోకి వచ్చిన తరువాత 2012, 2017, 2024 మూడుసార్లు టీచర్స్ రిక్రూట్‌మెంట్ జరిగింది. టెట్ వారికి అమలులోకి వచ్చింది. అంతకు ముందు జరిగిన టీచర్స్ రిక్రూట్‌మెంట్‌లో టెట్ అమలులో లేదు. సుప్రీంకోర్టు తీర్పులో ఐదు సంవత్సరాల లోపు పదవీ విరమణకు దగ్గర ఉన్న వాళ్ళకు మినహాయింపు ఇచ్చారు. 1996 నుండి టీచర్స్‌గా ఉన్న వాళ్ళకు, 30 సంవత్సరాలు కావస్తున్న 50 సంవత్సరాలు దాటిన వాళ్ళు అనేక మంది ఉన్నారు. వాళ్ళలో కంటి చూపు, మోకాళ్ళనొప్పులు, ఇతర అనారోగ్యాలతో బాధపడుతున్న వాళ్ళు అనేక మంది ఉన్నారు. 50 సంవత్సరాలు దాటిన వారికి మినహాయింపు ఇవ్వడం కనీస న్యాయం. ప్రధానోపాధ్యాయ పదోన్నతిలో 50 సంవత్సరాలు దాటిన వారికి డిపార్ట్‌మెంట్ పరీక్ష నుండి మినహాయింపు ఉంది. 2024 సంవత్సరంలో ఎన్‌సిటిఇ కు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం వివరణ కోరితే 2010 కంటే ముందు టీచర్స్‌కు టెట్ అవసరం లేదని వివరణ ఇచ్చారు. ప్రస్తుతం సుప్రీం కోర్ట్ ఇచ్చిన తీర్పు 30 నుండి 40 వేల మంది టీచర్స్‌పై ప్రభావం పడుతుంది. భాషోపాధ్యాయులు ఉర్దూ, కన్నడ ఇతర దేశ భాషలలో బోధించే ఉపాధ్యాయులకు ఆంధ్రప్రదేశ్‌లో పేపర్ 3 నిర్వహిస్తున్నారు. తెలంగాణలో భాషోపాధ్యాయులకు సాంఘిక శాస్త్రం 60 మార్కులకు కేటాయించడం వలన అనేక మంది తెలుగులో ఉత్తీర్ణత సాధించడం లేదు. ముఖ్యంగా తెలుగు భాషలో నిర్వహించాలని అన్ని ఉపాధ్యాయ సంఘాలు కోరుకుంటున్నారు. బయాలజీ ఉపాధ్యాయులకు గణితం, భౌతిక శాస్త్రంలో పరీక్షలు నిర్వహించడం అనేక ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. రాష్ట్రప్రభుత్వం ఉపాధ్యాయుల సమస్యలను, వారి మానసిక వేదనను అర్థం చేసుకొని పేపర్ 3 నిర్వహించి భాషోపాధ్యాయులకు న్యాయం చేయాలి. ఎస్‌సి, ఎస్‌టి, వికలాంగులకు 60 మార్కులు, బిసిలకు 75 మార్కులు, ఒసిలకు 90 మార్కులు రావాలనడం సమంజసంగా లేదు. ఏ పరీక్షలలోనైనా 35 మార్కులకే ఉత్తీర్ణత ఉంటుంది. అలాంటిది టెట్‌లో 90 మార్కులు రావాలన్న నియమం ఉపాధ్యాయులను ఆందోళనకు గురిచేస్తుంది. కులప్రాతిపదికన మార్కులు కేటాయించడం ఏ పరీక్షలలోనూ లేదు. ఒక పాఠశాలలో ఎస్‌సి, ఎస్‌టి, బిసి, ఒసి నలుగురు ఉపాధ్యాయులు ఉంటే నలుగురిలో ఎస్‌సి, ఎస్‌టి ఉపాధ్యాయులకు 65% మార్కులు, బిసి ఉపాధ్యాయుడికి 77 మార్కులు, జనరల్ (ఒసి) ఉపాధ్యాయుడికి 89 మార్కులు అందరి కంటే ఎక్కువ వచ్చినప్పటికీ ఎస్‌సి, ఎస్‌టి, బిసి ఉపాధ్యాయులు ఉత్తీర్ణత సాధించినట్లు ప్రకటించి జనరల్ ఉపాధ్యాయుడు ఉత్తీర్ణత కాలేదు అనడం విశేషం. సమాజం దృష్టిలో, విద్యార్థుల తల్లిదండ్రుల దృష్టిలో, వారి భార్యాబంధువుల దృష్టిలో టెట్ పరీక్ష ఉత్తీర్ణత సాధించని ఉపాధ్యాయుడిగా చిన్నచూపు. టెట్ పరీక్ష అంటే ఉపాధ్యాయ అర్హత పరీక్ష 25, 30 సంవత్సరాల నుండి పదవ తరగతి విద్యార్థులకు బోధించి, ఉత్తమ పౌరులను తయారు చేసి కొంత మంది విద్యార్థులే ఉపాధ్యాయులుగా ఉద్యోగాలు సాధించేటట్లు సలహాలు, సహకారం అందించి మండల, జిల్లా, రాష్ట్ర స్థాయిలో ప్రభుత్వం చేత, స్వచ్ఛంద సంస్థల చేత ఉత్తమ ఉపాధ్యాయులుగా సన్మానింపబడి టెట్ పరీక్ష ఉత్తీర్ణత సాధించనంత మాత్రాన ఉపాధ్యాయ వృత్తికి పనికి రాదనడం ఏ రకమైన నీతి, న్యాయం, ధర్మమో అర్థం కావడం లేదని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కొంత మంది తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం, తెలంగాణ రాష్ట్ర విద్యా పరిశోధన శిక్షణ సంస్థ (ఎస్‌సిఆర్‌టిఇ) ఆధ్వర్యంలో పుస్తక రచయితలుగా ఉన్నవారు టెట్ పరీక్ష ఉత్తీర్ణత సాధించలేదు కాబట్టి ఉపాధ్యాయుడిగా అర్హత లేదు అనడం సమంజసమేనా? భాషోపాధ్యాయులు (తెలుగు, హిందీ, ఉర్దూ, కన్నడం, తమిళం ఇతర దేశీయ భాషలు)బయోలజీ బోధించే ఉపాధ్యాయులకు వారు బోధించే సబ్జెక్టులో టెట్ పరీక్షను నిర్వహించకుండా వారికి సంబంధం లేని ఆంగ్లం, సాంఘికశాస్త్రం, గణితం, భౌతిక శాస్త్రం, మానసిక శాస్త్రంలో పరీక్షలను నిర్వహించి ఉత్తీర్ణత సాధించాలని అనడం విచారించదగిన విషయంగా ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. టెట్ పరీక్ష ఉపాధ్యాయ అర్హత పరీక్ష మాదిరిగా డాక్టర్ అర్హత పరీక్ష, న్యాయవాద అర్హత పరీక్ష, ఇంజినీర్ అర్హత పరీక్ష అంటూ ఏ వృత్తిలో లేని అర్హత పరీక్ష ఉపాధ్యాయులకు మాత్రమే నిర్వహించడంలో ఆంతర్యమేమిటో అర్థం కావడం లేదని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. టెట్ ఉత్తీర్ణత సాధించకుంటే పదోన్నతి రాదనడం, ఉద్యోగం వదులుకోవలనడం ఇదేమి న్యాయమని అనేకమంది ఉపాధ్యాయులు భయాందోళనకు గురవుతున్నారు. విద్య ఉమ్మడి జాబితాలో ఉండడంవల్ల తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఏ రకమైన విధానం అమలు చేస్తుందో అని ప్రశ్నార్థకంగా మారింది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు టీచర్స్‌గా 2010 కంటే ముందు ఉన్న వాళ్ళకు టెట్‌నుండి మినహాయింపు ఇవ్వాలని కోరుకుంటున్నారు. గతంలో తెలంగాణ రాష్ట్ర టీచర్స్ ఫెడరేషన్ (టిఆర్‌టిఎఫ్) ఆధ్వర్యంలో దేశరాజధాని ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద పెద్ద ఎత్తున ధర్నా కార్యక్రమం నిర్వహించారు. ఉపాధ్యాయ శాసనమండలి సభ్యులు శ్రీపాల్ రెడ్డి కేంద్ర విద్యాశాఖ మంత్రిని కలిసి ఇన్ సర్వీస్ ఉపాధ్యాయులకు టెట్ నుండి మినహాయింపు ఇవ్వాలని కోరారు. ఉద్యోగ, ఉపాధ్యాయులకు, పదవీవిరమణ చేసిన ఉద్యోగ, ఉపాధ్యాయులకు, వారిపై ఆధారపడిన కుటుంబ సభ్యులకు నగదు రహిత హెల్త్ కార్డుల కోసం ఒక కమిటీని ఏర్పాటు చేయడం గొప్ప పరిణామంగా వారు భావిస్తున్నారు.

# ప్రత్యేక వ్యూహంతోనే గిరిజన వికాసం



తెలంగాణ విజన్ 2047, సమగ్ర అభివృద్ధి, మానవ వనరుల వికాసం, సమాన అవకాశాలపై ప్రత్యేక దృష్టి సారిస్తోంది. ఈ లక్ష్యాలను సాధించడంలో గిరిజన యువతపై రాష్ట్రం చేసే పెట్టుబడి చాలా కీలక పాత్ర పోషించనుంది. ఇప్పటివరకు తగిన విధంగా వినియోగించుకోని, అపార సామర్థ్యం కలిగిన గిరిజన యువతకు నైపుణ్యాభివృద్ధి కల్పించడం విజన్-2047 అమలులో ప్రధాన అంశంగా మారాల్సిన అవసరం ఉంది. జనగణన, రాష్ట్ర అంచనాల ప్రకారం తెలంగాణలో గిరిజనుల జనాభా 32.70 లక్షలు ఉంది. ఇది రాష్ట్ర జనాభాలో సుమారు 10 శాతం. ఇందులో 70 శాతం కంటే ఎక్కువ మంది షెడ్యూల్డ్ ప్రాంతాల్లో, మైదాన ప్రాంతాలలో నివసిస్తున్నారు. ముఖ్యంగా గిరిజన జనాభాలో 55 శాతం పైగా 30 సంవత్సరాల లోపు యువత ఉండటం రాష్ట్రానికి ఒక పెద్ద వరంగా చెప్పవచ్చు. అయితే విద్య, ఉపాధి వంటి రంగాల్లో ఉన్న నిర్మాణాత్మక అసమానతల వల్ల ఈ మానవ వనరు పూర్తిగా సత్ఫలితాలుగా మారడం లేదు. తెలంగాణలో గిరిజనుల అక్షరాస్యత రేటు సుమారు 63 శాతమే ఉండగా, రాష్ట్ర సగటు అక్షరాస్యత 72 శాతానికి పైగా ఉంది. అలాగే మాధ్యమిక స్థాయిలో గిరిజన ప్రాంతాల్లో పాఠశాల విడిచిపెట్టే గిరిజన విద్యార్థుల శాతం ఇంకా ఎక్కువగానే ఉంది. గిరిజన యువతలో సుమారు 70 శాతం మంది వ్యవసాయం, అనుబంధ కార్యకలాపాలపై ఆధారపడుతూ, రైతులుగా లేదా దినసరి కూలీలుగా జీవనం సాగిస్తున్నారు. దీనివల్ల ఆదాయ భద్రత లేకపోవడం ప్రధాన సమస్యగా మారింది. గిరిజన యువతలో దాదాపు 15 శాతం కన్నా తక్కువ మందికే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వం ద్వారా వివిధ నైపుణ్య శిక్షణ లభించిందన్న అంచనాలు ఉన్నాయి. తయారీ, సేవలు, సాంకేతిక రంగాల్లో వారి భాగస్వామ్యం చాలా తక్కువ. ఇది రాష్ట్ర దీర్ఘకాలిక అభివృద్ధికి సవాలుగా ఉండగా, వ్యూహాత్మక గిరిజనుల సుస్థిర అభివృద్ధికి ప్రాధాన్యత అంశాలు: తెలంగాణ విజన్ -2047 రాష్ట్రాన్ని ఆవిష్కరణలు, హరిత వృద్ధి, మౌలిక వసతుల విస్తరణ, జ్ఞానాధారిత పరిశ్రమల కేంద్రంగా తీర్చిదిద్దాలని లక్ష్యంగా పెట్టుకుంది. రాష్ట్రంలోని ప్రతి పౌరుడిని సాధికారతకు, ముఖ్యంగా బడుగు బలహీన వర్గాల సమగ్ర అభివృద్ధి, జీవన ప్రమాణాల మెరుగుదల, స్థిరమైన జీవనోపాధుల సాధనకు ఆరోగ్య సంరక్షణ, విద్య, నైపుణ్యాభివృద్ధి, ఆర్థిక సాధికారత అనే మూడు ప్రధాన రంగాలు కీలకం. వీటి ద్వారా వారి దీర్ఘకాలిక అభివృది, సుస్థిర జీవనం సాధ్యమై, భరోసా కలుగుతుంది. ఈ భవిష్యత్ ఆర్థిక వ్యవస్థకు గిరిజన యువతను అనుసంధానించాలంటే, సంప్రదాయ వృత్తులకే పరిమితం కాకుండా పునరుత్పాదక ఇంధనం, అగ్రి-ప్రాసెసింగ్, ఆహార విలువ గొలుసులు, ఆరోగ్య సేవలు, నిర్మాణ రంగం, లాజిస్టిక్స్, డిజిటల్ సేవలు, ఎకో-టూరిజం వంటి కొత్త రంగాల్లో నైపుణ్య శిక్షణ అందించాలి. ప్రతి ఏడాది కనీసం లక్ష మంది గిరిజన యువతకు ఉపాధి కలిగించే నైపుణ్యాలు అందిస్తే, కుటుంబ ఆదాయాలు గణనీయంగా పెరగడమే కాకుండా స్థానిక ఉపాధి కల్పించడం ద్వారా షెడ్యూల్డ్ ప్రాంతాల నుంచి వలసలు పూర్తిగా తగ్గించవచ్చు. సంప్రదాయ జీవనోపాధి బలోపేతం ఆవశ్యకత: స్థానిక పరిస్థితులకు, గిరిజన సంస్కృతి, జీవన విధానాలకు అనుగుణమైన శిక్షణా కార్యక్రమాలు అవసరం. గిరిజన ప్రాంతాల్లో సహజ వనరులు, మానవ వనరులు సమృద్ధిగా ఉన్నాయి. చిన్న అటవీ ఉత్పత్తులు, వెదురు, ఔషధ మొక్కల ఆధారిత ఉత్పత్తులు, హస్తకళలు, సంప్రదాయ కళలలో విలువ జోడింపు చేయగలిగితే స్థిరమైన జీవనోపాధులు ఏర్పడతాయి. ఆధునిక నైపుణ్యాలు, నాణ్యత ధ్రువీకరణ, బ్రాండింగ్, మార్కెట్ అనుసంధానం కల్పిస్తే అటవీ ఉత్పత్తుల ద్వారా వచ్చే ఆదాయం 30 -50 శాతం వరకు పెరిగే అవకాశం ఉంటుంది. తద్వారా గిరిజన యువతతోపాటు గిరిజన మహిళలకు కూడా ప్రత్యక్ష లాభం చేకూరుతుంది. గిరిజన యువతకు డిజిటల్ విద్య: ప్రభుత్వ పాలన, విద్య, ఉపాధి రంగాలు డిజిటలైజ్ అవుతున్న తరుణంలో డిజిటల్ భాగస్వామ్యం అత్యంత కీలకం. డిజిటల్ విద్య లేమి గిరిజన యువతను వెనుకబాటుకు నెట్టే ప్రమాదం ఉంది. గిరిజన గ్రామాల్లో ఇంటర్నెట్ వినియోగం, డిజిటల్ పరిజ్ఞానం రాష్ట్ర సగటుతో పోలిస్తే తక్కువగా ఉంది. ప్రాథమిక డిజిటల్ నైపుణ్యాలు, ఐటి సేవలు, మౌలిక సదుపాయాలు అందిస్తే మారుమూల గిరిజన ప్రాంతాల్లో డిజిటల్ ప్లాట్‌ఫామ్ ఆధారిత ఉపాధి అవకాశాలు పెరుగుతాయి. ఇదివిజన్- 2047లో ఊహించిన జ్ఞాన ఆర్థిక వ్యవస్థకు అనుగుణంగా ఉంటుంది. నైపుణ్యాభివృద్ధి ఫలితాలు సాధించాలంటే అనుబంధ కార్యక్రమాలు కూడా కీలకం. ప్రాథమిక, మాధ్యమిక విద్య బలోపేతంచేయడంతో పాటు, పోషణ, ఆరోగ్యం, భాషా మాధ్యమం, ఆర్థిక చేకూర్పు వంటి అంశాలు శిక్షణను ఉపాధిగా మారుస్తాయి. గిరిజన మహిళలు,ఆదిమ గిరిజన తెగలు (పివిటిజిఎస్)పై ప్రత్యేక దృష్టి పెట్టడం అత్యవసరం. ఎందుకంటే వారు అనేక స్థాయిల్లో వెనుకబాటుకు గురవుతున్నప్పటికీ సమాజ స్థిరత్వంలో కీలక పాత్ర పోషిస్తున్నారు. తెలంగాణ విజన్- 2047 విజయవంతం కావాలంటే అభివృద్ధి ఫలాలు అత్యంత మారుముల, ఏజెన్సీ ప్రాంతాలలోన ఉన్న, అట్టడుగు వర్గాల వరకు చేరాలి. గిరిజన యువతకు నైపుణ్యాభివృద్ధి కల్పించడం కేవలం సంక్షేమ చర్య కాదు, ఇది దీర్ఘకాలిక ఆర్థిక అభివృద్ధి వ్యూహం. డేటా ఆధారిత ప్రణాళిక, బలమైన సంస్థాగత వ్యవస్థలు, పరిశ్రమలకు అనుగుణమైన శిక్షణతో గిరిజన యువతను నైపుణ్యవంతులైన ఉద్యోగులుగా, వ్యాపారవేత్తలుగా, ఆవిష్కర్తలుగా తీర్చిదిద్ద గలదు. అలా గిరిజన యువతను రాష్ట్ర అభివృద్ధి ప్రయాణంలో క్రియాశీల భాగస్వాములుగా 2047 నాటికి సమృద్ధి, సమానత్వం, స్థిరత్వం కలిగిన తెలంగాణను నిర్మించవచ్చు.

# ఎక్స్ కిరణాల ఆవిష్కర్త రాంట్జెన్



19 వ శతాబ్దం సంచలనాత్మక శాస్త్రీయ ఆవిష్కరణలకు స్వర్ణ యుగం. అలాంటి యుగంలో భౌతిక శాస్త్ర ప్రొఫెసర్ విల్హెల్మ్ కాన్రాడ్ రాంట్జెన్ ఒక వింతను కనుగొన్నాడు, దానిని చాలా మంది నమ్మలేదు. రాంట్జెన్ యొక్క ఆవిష్కరణ వార్తలు జనవరి 1896 ప్రారంభం నుండి ప్రపంచ వ్యాప్తంగా వ్యాపించాయి. శాస్త్రవేత్తలు సైతం నివేదికలను ప్రాక్టికల్ జోకర్ ఉపాయం అని కొట్టి పారేశారు.రోగ నిర్ధారణకు కొత్త ఒరవడిని సృష్టించి, ప్రపంచంలో వైద్య రంగంలో రోగ నిర్ధారణకు (రేడియోగ్రఫీ), రోగ నిర్మూలనకు (రేడియో థెరఫీ) కొరకు ఉపయోగించే ఎక్స్ కిరణాలను కనుగొన్న ప్రఖ్యాత శాస్త్రవేత్త విల్హేల్మ్ కన్రాడ్ రాంట్జెన్. ఆయన కనుగొన్న ఎక్స్ కిరణాలు వైద్యరంగం లోనె కాక భద్రతా రంగంలో ఉపయోగ పడుతున్నాయి. విల్హేల్మ్ కన్రాడ్ రాంట్జెన్ (మర్చి 27,1845 – 1923 ఫిబ్రవరి 10) జర్మన్ దేశ భౌతిక శాస్త్ర శాస్త్రవేత్త. 1895 నవంబరు 8 న విద్యుదయస్కాంత తరంగాలలో వివిధ తరంగ దైర్ఘ్యులల అవధులలో గల ఎక్స్- కిరణాలను కనుగొన్నాడు. ఈ పరిశోధన వల్ల 1991 లో భౌతిక శాస్త్రంలో మొదటి సారి నోబెల్ బహుమతి పొందాడు. ఆయన చేసిన కృషికి గాను ఆవర్తన పట్టిక లో 111 పరమాణు సంఖ్య గల మూలకానికి రాంట్ జీనియమ్ అనిపేరు పెట్టి గౌరవించారు. రాంట్జన్ 1845 మార్చి 27 న జర్మనీలోని లెన్నెస్ లో జన్మించాడు. ఈయన తండ్రి ఒక రైతు. తల్లి ఒక డచ్ మహిళ. హాలెండ్ లో విద్యాభ్యాసం జరిగింది. 1865 లో యుట్రెచ్ యూనివర్సిటీ లో చేరుటకు ప్రయత్నాలు ప్రారంభించాడు. కాని జూరిచ్ లో గల ఫెడరల్ పాలిటెక్నిక్ సంస్థలో చేరి పరీక్షలను ఉత్తీర్ణుడయ్యాడు. అక్కడ మెకానికల్ ఇంజనీరుగా చేరాడు. 1869లో తత్వ శాస్త్రములో జూరిచ్ విశ్వ విద్యాలయం నుండి పి.హెచ్.డి పట్టాను పొందాడు. ఆ విశ్వ విద్యాలయంలో ప్రముఖ ప్రొపెసర్ అయిన ఆగస్టు కుండ్ట్ కు ప్రియమైన శిష్యుడయ్యాడు. 1874 లో స్టాన్ ఫర్డు విశ్వ విద్యాలయంలో అద్యాపకునిగా నియమించ బడ్డాడు. 1875 లో హోహెనీం విశ్వ విద్యాలయంలో ప్రొఫెసర్ గా, తర్వాత 1876 లో స్టాన్ ఫర్డు విశ్వ విద్యాలయంలో మరల అద్యాపకునిగా, 1888 లో గీసన్ విశ్వ విద్యాలయంలో భౌతిక శాస్త్ర ఆచార్యునిగా, తర్వాత వుర్జ్ బర్గ్ విశ్వ విద్యాలయంలో భౌతిక శాస్త్ర విభాగంలో విధులు నిర్వర్తించాడు. 1900లో ప్రభుత్వ అభ్యర్థనపై మంచ్ యూనివర్సిటీలో చేరాడు. ఆయన కుటుంబం యు.ఎస్.ఎకు వలస వెళ్ళాలని నిర్ణయించు కున్నారు. న్యూయార్క్ లో కొలంబియా యూనివర్సిటీ వారు అవకాశం యిచ్చినప్పటికీ మొదటి ప్రపంచ యుద్ధం కారణంగా తన శేష జీవితాన్ని మునిచ్ నందే గడిపాడు. 1895 వరకు ఉత్సర్గనాళ ప్రయోగాలలో హెర్ట్జ్, జాన్ హిటార్ఫ్, విలియం క్రూక్స్, టెస్లా,లీనార్డ్ లతో పని చేశాడు. ఎక్స్ కిరణాలను రాయింట్ జన్ కిరణాలని అంటారు. కాని రాంట్జెన్ స్వయంగా వాటిని ఎక్స్ కిరణాలని పిలిచాడు. ఈ కిరణాలను కనుగొని లోకానికి పరోపకారం చేసినందుకు కృతజ్ఞతగా ఆయనకు 1901 లో భౌతిక శాస్త్రంలో నోబెల్ బహుమతి లభ్యమయింది. ఈ ఎక్స్ రే వెనుక ఎంతో ఆసక్తి కరమైన కథ ఉంది. రాయింట్ జన్ కేథోడ్ రే ట్యూబ్ (శూన్య గాజు నాళం) తో పరిశోధనలు చేసేవాడు. గది అంతా చీకటిగా ఉన్నప్పుడు యీ ట్యూబ్ గుండా కాంతి కిరణాలను పంపడం జరిగింది. పైగా ట్యూబ్ చుట్టూ నల్లని కాగితాన్ని కాంతి కిరణాలు ఏ కొంచెం కూడా వెలువడ కుండా కప్పి ఉంచాడు. ఇలా చేసినప్పటికి కాథోడ్ ట్యూబ్ కు సమీపంలో ఉన్న బేరియం ప్లాటినో సైనైడ్ స్ఫటికం వింత మెరుపులతో ప్రకాశించ సాగింది. నల్లటి కాగితాన్ని కప్పి ఉంచినప్పటికీ కాథోడ్ ట్యూబ్ నుంచి ఏవో అజ్ఞాత కిరణాలు వెలువడి బేరియం ప్లాటినో సైనైడ్ స్ఫటికం మీద పడి అది మెరిసేటట్లు చేసిందని ఆయన ఊహించగలిగాడు. ఈ కిరణాలను కాగితం గుండా, చెక్కగుండా, లోహపు పలకల గుండా ప్రయాణం చేయగలవని యీయన కనుగొన్నాడు. ఈ కిరణాలు కూడా ఓ రకమైన కాంతి కిరణాలే అని అయితే వీటి తరంగ దైర్ఘ్యం చాలా తక్కువ కావటం వల్ల మనుషుల కళ్ళకు కనిపించవని రాయింట్జన్ వెల్లడించాడు. మామూలు కాంతి కిరణాలే ఫోటోగ్రాఫిక్ ప్లేట్ల మీద ప్రభావం చూపుతూ ఉండగా, యీ కిరణాలు మాత్రం చూపకుండా ఉంటాయా అనే ఆలోచన రాయింట్ జెన్ కి రావటం – శాస్త్ర ప్రపంలో ఒక సరికొత్త అధ్యాయానికే కారణ భూతమైనది. ప్రయోగం చేయటం కోసం రాంట్జెన్ ఫోటో గ్రాఫిక్ ప్లేటు మీద తన భార్య చేతిని ఉంచి యీ కిరణాలను ప్రసారం చేసి ఫోటోను డెవలప్ చేసి చూసి ఆశ్చర్య పోయాడు. చేతి ఎముకలు ఉంగరంతో సహా ఆ ఫోటో లో వచ్చింది. చుట్టూ మాంసం ఉన్నట్లు మసక మసకగా ఉంది. అంటే సజీవంగా ఉన్న మనిషి కంకాళాన్ని ఈ కిరణాల ద్వారా ఫోటో తీయవచ్చని స్పష్టంగా తేలింది. దురదృష్ట వశాత్తు రాంట్జెన్, ఆయనతో కలిసి పనిచేసిన మరో ఇద్దరు పరిశోధకులు యీ ఎక్స్ కిరణాల తాకిడికే క్రమ క్రమంగా మరణించాడు. ఈ ఎక్స్-కిరణాల వల్ల ఎంతో ప్రయోజనం కలుగుతున్నప్పటికీ వాటిని మితిమీరి వాడితే మాత్రం ప్రమాదం తప్పదని,యీ కారణంగానే ఎక్స్-కిరణాలను నిరంతరం గురి కాబట్టే రాంట్జెన్ ఆ కిరణాల ప్రభావంగానే చని పోయాడని రుజువైంది. రేడియో ధార్మికత నుండి రక్షించు కొనుటకు సీసపు కవచాలు వాడే కొద్దిమంది మార్గ నిర్దేశకులో ఆయన ఒకరు.ఆయన చేసిన ఆవిష్కరణలకు పేటెంట్ హక్కులు కూడా తీసుకోలేదు. నోబెల్ బహుమతిగా వచ్చిన ధనమును వర్జ్ బర్గ్ విశ్వ విద్యాలయమునకు విరాళంగా యిచ్చాడు. మొదటి ప్రపంచ యుద్ధం వల్ల యేర్పడే ద్రవ్యోల్బణం వల్ల రాంట్జెన్ చాలా పేదరికంలో మగ్గాడు. తన శేష జీవితాన్ని మునిచ్కి సమీపంలో గల విల్ హెల్మ్ లో గల యింటిలో గడిపాడు. ఆయన కోరిక ప్రకారం ఆయన వ్యక్తిగత, శాస్త్రమునకు సంబంధించిన ఉత్తర ప్రత్యుత్తరాలు ఆయన మరణం తర్వాత నాశనం చేయటం జరిగింది. 1901 లో రాంట్జెన్ కు మొదటి భౌతిక శాస్త్రంలో నోబెల్ బహుమతి వచ్చింది. ఈ బహుమతి ఆయన ఎక్స్ కిరణాలు కనుగొని విశేష సేవలందించినందుకు గాను యివ్వ బడింది. కాని రాంట్ జెన్ ఆ బహుమతికి వచ్చిన ఆర్థిక ప్రతిఫలాన్ని తన విశ్వ విద్యాలయమునకు దానమిచ్చాడు. పియరీ క్యూరీ వలే రాంట్జెన్ తన పరిశోధనకు పేటెంట్ హక్కులను తిరస్కరించాడు. మానవాళికి తన పరిశోధన యొక్క ఫలితాలు ఉపయోగకరంగా ఉండాలని, ఈ కిరణాలకు తన పేరు కూడా పెట్టరాదని కోరుకున్నాడు.

## ఇంటర్‌నెట్ వినియోగంలో తగు జాగ్రత్తగా తీసుకోలేమా !

ఆధునిక మానవుడు అంతర్జాల వలయంలో మునిగి తేలుతున్నాడు. స్మార్ట్‌ఫోన్ రాకతో అతి సామాన్యుల ముంగిట్లో కూడా ఇంటర్నెట్ ప్రవేశించింది. మితిమీరిన వాడకంతో ఇంటర్నెట్ దురలవాటు బారిన కూడా యువత, పిల్లలు పడడం చూస్తున్నాం. అంతర్జాల రాకతో విశ్వ విజ్ఞానం మన అరచేతిలో ఇమిడి పోయింది. అంతర్జాలంతో అసంఖ్యాక ప్రయోజనాలు ఉన్నప్పటికీ దాని పట్ల జాగ్రత్తగా ఉండని యెడల పలు ప్రమాదకర నష్టాలు కూడా మన అనుభవంలోకి వస్తున్నాయి. అసభ్యకర అవమానకర మాటలను వినవలసి వస్తున్న వేళ సురక్షిత ఇంటర్నెట్ పట్ల అవగాహన కల్పించాల్సిన అగత్యం ఏర్పడింది. అంతర్జాలం వాడడం తప్పనిసరి అవుతున్న దాని పట్ల కనీస పరిజ్ఞానం, తగు జాగ్రత్తలు తీసుకోవడం కనీస అవసరం అవుతున్న వేళ ఇంటర్నెట్‌ను సురక్షితంగా వినియోగించుకునే మార్గాలను అవగాహన పరచడానికి 2004 నుంచి ప్రతి ఏట 10 ఫిబ్రవరిన ప్రపంచ దేశాలు “సురక్షిత అంతర్జాల దినం” లేదా “సేఫర్ ఇంటర్నెట్ డే”పాటించడం ఆనవాయితీగా మారింది. నేటి సమాజంలో విద్యాలయాలు, కుటుంబాలు, బంధు మిత్రులు, సహచర వర్గాలు, పౌర సమాజాల్లో సురక్షితంగా అంతర్జాలాన్ని ఎలా వినియోగించాలో ప్రజలకు, విద్యార్థులకు తెలుపవలసిన అవసరం వచ్చింది. ఆన్‌లైన్‌లో గౌరవంగా మాట్లాడడం, సత్ప్రవర్తనతో వినియోగించడం, సహానుభూతి ప్రదర్శించడం, హానికరమైన చర్యలకు దూరంగా ఉండడం లాంటివి మనం ఆచరణలో పెట్టాలి. సురక్షిత అంతర్జాల దినం-2026 ఇతివృత్తంగా “అందరు కలిసి సురక్షిత అంతర్జాలాన్ని నిర్మించుకుందాం” అనబడే అంశాన్ని తఈసుకున్నారు. అంతర్జాల ప్రధాన దుర్వినియోగాల్లో సైబర్ బుల్లీయింగ్, ఆన్‌లైన్ ఆర్థిక మోసాలు, ఫిషింగ్ స్కామ్, డాటా బ్రీచింగ్, అనధికారిక చొరబాట్లు, మాల్‌వేర్, ఆన్‌లైన్ గేమింగ్, వ్యక్తిగత సమాచార దుర్వినియోగం, ఆన్‌లైన్ ప్రిడేటర్స్, సెక్స్టింగ్, రాన్‌సమ్‌వేర్, సైబర్ క్రైమ్స్, ఆన్‌లైన్ బెట్టింగ్ మోసాలు, ఆన్‌లైన్ అప్పుల వేధింపులు, డిజిటల్ అరెస్టులు, వ్యక్తిగత సమాచారాన్ని దోచేసి వేధించడం లాంటి పలు అంశాల పట్ల తగు జాగ్రత్తగా ఉండడం అనివార్యం అయ్యింది. వీటి పట్ల అవగాహన లేని యెడల పలు చిక్కులను ఎదుర్కోవలసి వస్తుందని తెలుసుకోవాలి.

# అధిక యూరిక్ యాసిడ్‌కు చెక్ పెట్టే బెస్ట్ ఫ్రూట్స్



ఈ మధ్య కాలంలో చాలా మంది హై యూరిక్ యాసిడ్ సమస్యతో బాధపడుతున్నారు. హై యూరిక్ యాసిడ్‌ను హైపర్ యూరిసెమియా అని కూడా పిలుస్తారు. ఈ సమస్య బారిన పడిన వారు కీళ్ల నొప్పులు, కిడ్నీ సమస్యలతో బాధపడుతుంటారు. రోజులు గడిచే కొద్దీ ఈ సమస్య అనేది తీవ్రతరం అవుతుంది. అందుకే ప్రారంభంలోనే ఈ సమస్యలకు చెక్ పెట్టాలని చెబుతున్నారు ఆరోగ్య నిపుణులు. ముఖ్యంగా లైఫ్ స్టై?ల్ ఛేంజ్.. కొన్ని రకాల పండ్లు తీసుకోవడం వలన అధిక యూరిక్ యాసిడ్‌ను తగ్గించుకోవచ్చునంట. బెర్రీస్ : బెర్రీస్ ఆరోగ్యానికి చాలా మేలు చేస్తాయి. ముఖ్యంగా వీటిలో యాంటీ ఆక్సిడెంట్స్, విటమిన్ సి, పాలీ ఫెనాల్స్ వంటి పోషకాలు పుష్కలంగా ఉంటాయి. అందువలన వీటిని మీరు మీ డైట్‌లో చేర్చుకోవడం వలన ఇవి సహజంగానే మీ శరీరంలోని అదనపు యూరిక్ యాసిడ్ తగ్గించడానికి ఉపయోగపడతాయి. ముఖ్యంగా బెర్రీస్‌లలో నీటి శాతం ఎక్కువగా ఉండటం వలన ఇవి మూత్రం ద్వారా విషయాన్ని బయటకు పంపిస్తాయి. అందువలన తప్పకుండా వీటిని డైట్‌లో చేర్చుకోవాలంట. సిట్రస్ పండ్లు : సిట్రస్ జాతికి చెందిన పండ్లు యూరిక్ యాసిడ్‌ను తగ్గించడంలో కీలక పాత్ర పోషిస్తాయి. వీటిలో విటమిన్ సి ఎక్కువగా ఉంటుంది. అందువలన నిమ్మ, నారిజ పండ్లను డైట్‌లో చేర్చుకోవడం వలన ఇవి మూత్ర పిండాల పనితీరును మెరుగు పరిచి, సహజంగానే శరీరంలోని యూరిక్ యాసిడ్‌ను తగ్గించడానికి ఉపయోగపడుతాయి. ముఖ్యంగా ఉదయాన్నే పరగడుపున నిమ్మకాయ నీరు తాగడం లేదా, మధ్యాహ్నం లంచ్ తర్వాత నారింజ పండ్లు తినడం వలన అదనపు ప్రయోజనం చేకూరుతుంది. అరటి పండ్లు : అరటి పండ్లలో పొటాషియం పుష్కలంగా ఉంటుంది. అంతే కాకుండా చాలా మంది వీటిని ఎంతో ఇష్టంగా తింటారు. అయితే ప్రతి రోజూ ఒక అరటి పండు తినడం వలన శక్తి లభించడమే కాకుండా శరీరంలోని అధిక యూరిక్ యాసిడ్ కూడా తగ్గుతుందంట. అరటిలో పొటాషియం ఎక్కువగా ఉండటం వలన ఇది మూత్రపిండాల పనితీరును మెరుగు పరుస్తుంది, అలాగే ఇందులోని ప్యూరిన్, యూరిక్ యాసిడ్ విచ్ఛిన్నం అయ్యేలా చేస్తుంది.చెర్రీస్ : చెర్రీస్ చాలా రుచిగా ఉండటమే కాకుండా ఇవి ఆరోగ్యానికి కూడా చాలా మంచిది. ముఖ్యంగా అధిక యూరిక్ యాసిడ్‌ను తగ్గించడంలో ఇవి కీలక పాత్ర పోషిస్తాయి. వీటిలో ఆంథోసైనన్‌లు పుష్కలంగా ఉండటం వలన ఇది కీళ్ల నొప్పుల, కాళ్ల వాపులు వంటి సమస్యలకు చెక్ పెడుతుంది. అలాగే, అదనపు యూరిక్ యాసిడ్‌ను తగ్గిస్తుంది. పైనాపిల్ :పైనాపిల్‌లో బ్రోమెలైన్ అనే ఎంజైమ్ ఉంటుంది. ఇది సహజ శోథ లక్షణాలు కలిగి ఉంటుంది. అందువలన అధిక యూరిక్ యాసిడ్‌తో బాధపడే వారు వీటిని ఆహారంలో చేర్చుకోవడం వలన కీళ్ల నొప్పుల వంటి సమస్యలు తగ్గిపోతాయి. అదే విధంగా, ఇవి మూత్రపిండాల ఆరోగ్యానికి చాలా మంచిది.

# ఈ ఒక్క పని చేయండి చాలు ఈ సమస్యలన్నీ ఖతం



మనం సాధారణంగా నిమ్మరసాన్ని చల్లని నీటిలోనో లేదా సోడాలోనో కలుపుకుని తాగుతాం. అయితే ఆయుర్వేదం, ఆధునిక వైద్యం ప్రకారం, ప్రతిరోజూ ఉదయాన్నే ఖాళీ కడుపుతో ఒక గ్లాసు గోరువెచ్చని నీటిలో నిమ్మరసం పిండుకుని తాగడం వల్ల అనేక లాభాలు ఉన్నాయి. దీనిని శరీరానికి ఒక సంజీవనిలా పనిచేస్తుందని పేర్కొంటున్నారు ఆరోగ్య నిపుణులు. ఉరుకులు పరుగుల జీవితంలో ఎన్నో అనారోగ్య సమస్యలు వెంటాడుతున్నాయి.. ఇలాంటి పరిస్థితుల్లో ఆరోగ్యాన్ని కాపాడుకునేందుకు.. ఆరోగ్యకరమైన జీవనశైలి, ఆహారం తీసుకోవడం మంచిది.. అలాంటి ఆరోగ్యకరమైన విషయాల్లో ఈ అద్భుత పానీయం ఒకటి.. అదేంటో కాదు.. జస్ట్ 2 రూపాయలకు దొరికే నిమ్మకాయ.. అలాగే వేడి నీరు.. ప్రతిరోజూ ఉదయాన్నే వేడినీరు, నిమ్మరసం కలిపి తాగడం వల్ల ఎన్నో ఆరోగ్య ప్రయోజనాలు లభిస్తాయని ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు. మనం సాధారణంగా నిమ్మరసాన్ని చల్లని నీటిలోనో లేదా శీతల పానీయాలలోనో తాగుతాం. అయితే, ఆయుర్వేదం, ఆధునిక వైద్య నిపుణులు గోరువెచ్చని నీటిలో నిమ్మరసం కలిపి తాగమని సిఫార్సు చేస్తున్నారు. ప్రతి ఉదయం ఖాళీ కడుపుతో ఒక గ్లాసు గోరువెచ్చని నీటిలో ఒక నిమ్మకాయను పూర్తిగా పిండుకొని తాగడం వల్ల అది మన శరీరానికి సంజీవనిలా పనిచేస్తుంది. డాక్టర్లు కూడా సిఫార్సు చేసే ఈ పానీయం వల్ల కలిగే తొమ్మిది అద్భుత ప్రయోజనాలు కలుగుతాయి. కొవ్వును కరిగిస్తుంది: మీరు బరువు తగ్గాలని చూస్తున్నట్లయితే, వేడి నిమ్మరసం ఉత్తమ పానీయం. నిమ్మరసంలోని ఔషధ గుణాలు శరీరంలో పేరుకుపోయిన అదనపు కొవ్వును కరిగించి, రక్త సరఫరాను మెరుగుపరుస్తాయి. దీనివల్ల గుండె ఆరోగ్యంగా ఉంటుంది. షుగర్ వ్యాధికి చెక్: మధుమేహం ఉన్నవారికి నిమ్మరసం ఎంతో మేలు చేస్తుంది. ఇది రక్తంలోని గ్లూకోస్ స్థాయిలను అదుపులో ఉంచి, షుగర్ లెవెల్స్ పెరగకుండా కాపాడుతుంది. వ్యర్థాల శుద్ధి: మనం పీల్చే గాలి, తినే ఆహారం ద్వారా శరీరంలోకి వెళ్ళే విష పదార్థాలను బయటకు పంపడంలో వేడి నిమ్మరసం అద్భుతంగా పనిచేస్తుంది. ఇది మీ శరీరాన్ని లోపల నుండి శుభ్రం చేస్తుంది. రోగనిరోధక శక్తి పెంపు: నిమ్మరసంలో ఉండే విటమిన్ సి, యాంటీఆక్సిడెంట్లు సహజసిద్ధమైన యాంటీబయాటిక్‌గా పనిచేస్తాయి. ఇది రోగనిరోధక శక్తిని పెంచి, వైరల్ ఇన్‌ఫెక్షన్లు రాకుండా అడ్డుకుంటుంది. కిడ్నీలో రాళ్ల నుంచి ఉపశమనం: నిమ్మరసం తాగడం వల్ల శరీరంలో పొటాషియం, సిట్రేట్ స్థాయిలు పెరుగుతాయి. ఇది కిడ్నీలో పేరుకుపోయిన రాళ్లను నెమ్మదిగా కరిగించడానికి సహాయపడుతుంది. గాల్ బ్లాడర్ రాళ్లకు పరిష్కారం: కేవలం కిడ్నీలే కాదు, గాల్ బ్లాడర్ అంటే పిత్తాశయంలో రాళ్ల వల్ల వచ్చే కడుపునొప్పిని తగ్గించడంలో కూడా ఈ పానీయం తోడ్పడుతుంది. జీర్ణ సమస్యలకు పరిష్కారం: గ్యాస్, అసిడిటీ, మలబద్ధకం వంటి సమస్యలతో బాధపడేవారికి వేడి నిమ్మరసం ఒక వరం. ఇది జీర్ణ వ్యవస్థను చురుగ్గా ఉంచి, తిన్న ఆహారం త్వరగా అరిగేలా చేస్తుంది.మెరిసే చర్మం కోసం: చర్మంపై ముడతలు, మచ్చలు తగ్గి, చర్మం కోమలంగా, కాంతివంతంగా మారాలంటే నిమ్మరసం తాగాల్సిందే. ఇందులోని యాంటీఆక్సిడెంట్లు చర్మానికి మంచి మెరుపునిస్తాయి. నొప్పులు ? వాపుల నుంచి ఉపశమనం: కీళ్లనొప్పులు, వాపులతో బాధపడేవారికి ఇది మంచి ఉపశమనాన్ని ఇస్తుంది. అలాగే ఫ్లూ జ్వరం, దగ్గు, జలుబు వంటి సమస్యల నుండి కూడా త్వరగా కోలుకునేలా చేస్తుంది. ఇలా.. ఒక గ్లాసు వేడి నిమ్మరసం మీ శరీరంలో ఎన్ని అద్భుతాలు చేస్తుంది.. ఖరీదైన మందుల కంటే మన ఇంట్లో దొరికే ఈ సహజమైన పానీయం ఎంతో మేలు చేస్తుంది. ఇంకెందుకు ఆలస్యం ఉదయాన్ని ఒక గ్లాసు వేడి నిమ్మరసంతో మీ రోజును ప్రారంభించండి. నిమ్మరసం తాగిన తర్వాత పళ్ళ ఎనామిల్ దెబ్బతినకుండా ఉండడానికి సాధారణ నీటితో నోటిని పుక్కిలించడం మంచిది.

# గుమ్మడికాయ గింజలు 30 రోజులు తిన్నారంటే..



ఈ చిన్న గింజలు ఆరోగ్యానికి చాలా ప్రయోజనకరంగా ఉంటాయి. వాటిని ప్రతిరోజూ సరైనమోతాదులో ఒక నెల పాటు తీసుకోవడం వల్ల మీ శరీరంపై సానుకూల ప్రభావం ఉంటుంది. ఒక నెల పాటు ప్రతిరోజూ గుమ్మడికాయ గింజలు తీసుకోవడం వల్ల మీ ఆరోగ్యం మ్యాజిక్ చేసినట్టుగా మెరుగుపడుతుంది. మీరు మీ రోగనిరోధక శక్తిని పెంచుకోవాలనుకున్నా, బరువు తగ్గాలనుకున్నా, లేదా మీ గుండె, ఎముకలను బలోపేతం చేయాలనుకున్నా, ఈ చిన్న సూపర్‌ఫుడ్ మీ ఆరోగ్యానికి ఒక వరం. కాబట్టి, ఈరోజే గుమ్మడికాయ గింజలను మీ ఆహారంలో చేర్చుకోవడం ప్రారంభించండి. వాటి అద్భుతమైన ప్రయోజనాలను అనుభవించండి. గుమ్మడికాయ గింజల్లో ఫైబర్ పుష్కలంగా ఉంటుంది. ఇది జీర్ణవ్యవస్థ సజావుగా పనిచేయడానికి సహాయపడుతుంది. క్రమం తప్పకుండా తీసుకోవడం వల్ల మలబద్ధకం నుండి ఉపశమనం లభిస్తుంది. కడుపు శుభ్రంగా ఉంటుంది. ఈ విత్తనాలలో ఒమేగా-3, ఒమేగా-6 కొవ్వు ఆమ్లాలు, మెగ్నీషియం, జింక్ వంటి పోషకాలు ఉంటాయి. ఇవి గుండె ఆరోగ్యానికి దోహదం చేస్తాయి. ఇవి రక్తపోటును నియంత్రించడంలో, కొలెస్ట్రాల్ స్థాయిలను తగ్గించడంలో కూడా సహాయపడతాయి. గుమ్మడికాయ గింజల్లో జింక్, యాంటీఆక్సిడెంట్లు పుష్కలంగా ఉంటాయి. ఇవి శరీర రోగనిరోధక శక్తిని పెంచుతాయి. వీటిని రోజూ తీసుకోవడం వల్ల జలుబు, ఇతర ఇన్ఫెక్షన్లు రాకుండా ఉంటాయి. గుమ్మడికాయ గింజలు ప్రోటీన్, ఆరోగ్యకరమైన కొవ్వులు, ఖనిజాలను కలిగి ఉంటాయి. ఇవి మిమ్మల్ని రోజంతా శక్తివంతం చేస్తాయి. వీటిని అల్పాహారంగా లేదా చిరుతిండిగా తినడం వల్ల అలసటను దూరం చేసుకోవచ్చు. గుమ్మడికాయ గింజలు రక్తంలో చక్కెరను నియంత్రించడంలో సహాయపడతాయి. వాటిలో ఇన్సులిన్ స్థాయిలను మెరుగుపరిచే, టైప్ 2 డయాబెటిస్ ప్రమాదాన్ని తగ్గించే సమ్మేళనాలు ఉంటాయి. ఈ విత్తనాలలో లభించే విటమిన్ ఇ, జింక్, ఆరోగ్యకరమైన కొవ్వులు మీ చర్మాన్ని ప్రకాశవంతంగా, మీ జుట్టును బలంగా ఉంచడంలో సహాయపడతాయి. క్రమం తప్పకుండా తీసుకోవడం వల్ల జుట్టు రాలడం కూడా తగ్గుతుంది. గుమ్మడికాయ గింజల్లో ట్రిప్టోఫాన్ అనే అమైనో ఆమ్లం ఉంటుంది. ఇది మెలటోనిన్ అనే హార్మోన్‌ను పెంచుతుంది. మంచి నిద్రకు ఈ హార్మోన్ చాలా అవసరం. మీరు నిద్ర సమస్యలతో ఇబ్బంది పడుతుంటే, ప్రతిరోజూ గుమ్మడికాయ గింజలను తినడాన్ని పరిగణించండి. గుమ్మడికాయ గింజలు కాల్షియం, మెగ్నీషియం, భాస్వరం మంచి మూలం. ఈ మూలకాలు ఎముకలను బలోపేతం చేయడానికి, ఆస్టియోపోరోసిస్ వంటి వ్యాధుల నుండి రక్షించడానికి సహాయపడతాయి. మీరు బరువు తగ్గడానికి ప్రయత్నిస్తుంటే, గుమ్మడికాయ గింజలు ఒక గొప్ప చిరుతిండి కావచ్చు. వాటిలో ప్రోటీన్, ఫైబర్ పుష్కలంగా ఉంటాయి. ఇవి ఆకలిని నియంత్రించడంలో, అతిగా తినకుండా నిరోధించడంలో సహాయపడతాయి.

# చియా సీడ్స్, బీట్‌రూట్ జ్యూస్ శరీరంలో జరిగే మ్యాజిక్



బీట్‌రూట్, చియా విత్తనాల నీరు సమగ్ర ఆరోగ్య ప్రయోజనాలను అందిస్తుంది. ఇది గుండె, మెదడు, చర్మం, జీర్ణక్రియను మెరుగుపరుస్తుంది. బరువు తగ్గడానికి, శరీరానికి శక్తిని అందించడానికి, హైడ్రేటెడ్‌గా ఉంచడానికి సహాయపడుతుంది. విటమిన్ బి9, విటమిన్ సి, ఐరన్, పొటాషియం వంటి పోషకాలు పుష్కలంగా ఉన్న ఈ పానీయం ఫిట్‌నెస్, జీవశక్తిని పెంచుతుంది. బీట్‌రూట్, చియా విత్తనాలతో తయారుచేసిన నీరు ఆరోగ్యానికి చాలా మేలు చేస్తుంది. ఇది గుండె, మెదడు, చర్మం, జీర్ణక్రియకు మంచిది. బరువు తగ్గడానికి కూడా సహాయపడుతుంది. మీరు ఫిట్‌గా మరియు శక్తివంతంగా ఉండాలనుకుంటే, ఈ ఆరోగ్యకరమైన పానీయాన్ని మీ ఆహారంలో చేర్చుకోండి. బీట్‌రూట్, చియా విత్తనాల నీరు ఆరోగ్యానికి చాలా మేలు చేస్తుంది. ఇది జీర్ణక్రియను మెరుగుపరచడమే కాకుండా బరువు తగ్గడానికి సహాయపడుతుంది. అంతేకాకుండా శరీరాన్ని హైడ్రేటెడ్‌గా ఉంచుతుంది. ఇందులో విటమిన్ బి9 (ఫోలేట్), విటమిన్ సి, ఐరన్, పొటాషియం వంటి అనేక ముఖ్యమైన పోషకాలు ఉన్నాయి. బీట్‌రూట్‌లో నైట్రేట్లు పుష్కలంగా ఉంటాయి. ఇవి రక్త నాళాలను మెరుగుపరచడం ద్వారా, రక్త ప్రవాహాన్ని పెంచడం ద్వారా రక్తపోటును సాధారణీకరించడంలో సహాయపడతాయి. చియా గింజలు, బీట్‌రూట్ రసం తీసుకోవడం వల్ల శక్తి పెరుగుతుంది. మొత్తం ఆరోగ్యాన్ని కాపాడుతుంది. బీట్‌రూట్‌లో నైట్రేట్లు పుష్కలంగా ఉంటాయి. ఇవి శరీరంలో ఆక్సిజన్ సరఫరాను మెరుగుపరుస్తాయి. దీనిని తీసుకోవడం వల్ల స్టామినా పెరుగుతుంది. బలహీనత, అలసట తొలగిపోతాయి. చియా గింజలు అధిక ప్రోటీన్, ఆరోగ్యకరమైన కొవ్వు పదార్థం కారణంగా శక్తిని సజావుగా విడుదల చేస్తాయి. మరోవైపు, చియా విత్తనాలలో ఒమేగా-3 కొవ్వు ఆమ్లాలు పుష్కలంగా ఉంటాయి. ఇవి వాపును నియంత్రిస్తాయి. ఇది ట్రైగ్లిజరైడ్ స్థాయిలను తగ్గించడం ద్వారా గుండె ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తుంది. బ్రెయిన్ ఫంక్షన్ మెరుగుపడి మెమరీ పెరుగుతుంది. శరీరం ఎప్పుడూ హైడ్రేట్ గా ఉంటుంది.. అందమైన చర్మం, జుట్టు అందిస్తుంది. రక్తం పెరుగుదలకు సహాయపడుతుంది..చియా గింజలు, బీట్‌రూట్ రసం ప్రతిరోజూ తీసుకోవడం వల్ల బరువు నియంత్రణలో ఉంటుంది. బీట్‌రూట్‌లో ఉండే యాంటీఆక్సిడెంట్లు, బీటాలైన్‌లు ఆక్సీకరణ ఒత్తిడిని నియంత్రించడంలో, చర్మపు మంటను తగ్గించడంలో సహాయపడతాయి. దీనిని తీసుకోవడం వల్ల రంగు మెరుగుపడుతుంది. కొవ్వు ఆమ్లాలు అధికంగా ఉండే చియా గింజలు చర్మాన్ని హైడ్రేట్ చేస్తాయి. చర్మంలో స్థితిస్థాపకతను కాపాడుకోవడంలో సహాయపడతాయి. బీట్‌రూట్ కాలేయాన్ని నిర్విషీకరణ చేయడంలో, కాలేయం నుండి విషాన్ని బయటకు పంపడంలో సహాయపడుతుంది. ఇందులో యాంటీఆక్సిడెంట్లు, బీటైన్ వంటి సమ్మేళనాలు ఉంటాయి. ఇవి కాలేయ ఆరోగ్యాన్ని మెరుగుపరచడంలో సహాయపడతాయి.

# దానిమ్మ వీరికి విషంతో సమానం.. తిన్నారో ఈ సమస్యలు ఖాయం..



ప్రకృతి ప్రసాదించిన అద్భుత ఫలం దానిమ్మ అంటే ఎవరికి ఇష్టం ఉండదు.. మెరిసే ఎర్రటి గింజలు కేవలం రుచికరమే కాదు.. అంతులేని ఆరోగ్య రహస్యాల గనులు కూడా.. రోజూ ఒక దానిమ్మ పండు తింటే డాక్టరుతో పనే ఉండదని అందరూ అంటుంటారు.. కానీ అది అందరికీ నిజం కాదా..? అసలు దానిమ్మను ఎవరెవరు ముట్టకూడదు? ఎర్రటి రంగులో ముత్యాల్లా మెరిసే దానిమ్మ గింజలు కేవలం రుచికరమైనవి మాత్రమే కాదు.. అంతులేని ఆరోగ్య రహస్యాల గనులు. విటమిన్ సి, ఐరన్, యాంటీఆక్సిడెంట్ల కలయిక అయిన దానిమ్మను రోజూ తీసుకోవడం వల్ల మీ శరీరంలో జరిగే మార్పులు తెలిస్తే ఆశ్చర్యపోతారు. అయితే అందరికీ ఇది మేలు చేయదు. అసలు దానిమ్మ ఎవరికి లాభం..? దానిమ్మలోని పాలీఫెనాల్స్ కణాలను దెబ్బతినకుండా కాపాడుతాయి. విటమిన్ సి పుష్కలంగా ఉండటం వల్ల ఇన్‌ఫెక్షన్ల నుంచి శరీరాన్ని కాపాడుతుంది. ఇందులో యాంటీవైరల్, యాంటీ బాక్టీరియల్ గుణాలు మెండుగా ఉన్నాయి. రక్తం గడ్డకట్టకుండా నిరోధించడంలో దానిమ్మ కీలక పాత్ర పోషిస్తుంది. ఇది కొలెస్ట్రాల్‌ను తగ్గించి, రక్త ప్రసరణను మెరుగుపరుస్తుంది. ఇందులోని ఫైబర్ పేగు ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తుంది. గ్యాస్, వాపు వంటి సమస్యలను తగ్గిస్తుంది. రక్తంలో హిమోగ్లోబిన్ పెరగాలంటే దానిమ్మ బెస్ట్ ఆప్షన్. ఐరన్ లోపంతో బాధపడేవారికి ఇది గొప్ప ఔషధం. ప్రోస్టేట్, రొమ్ము క్యాన్సర్ కణాల పెరుగుదలను అడ్డుకునే శక్తి దీనికి ఉందని అధ్యయనాలు చెబుతున్నాయి. వయసు పెరగడం వల్ల వచ్చే ముడతలు, మచ్చలను దానిమ్మలోని యాంటీఆక్సిడెంట్లు తగ్గిస్తాయి. చర్మం కాంతివంతంగా, యవ్వనంగా కనిపించేలా చేస్తుంది. దానిమ్మ అందరికీ మంచిది కాకపోవచ్చు. ఈ కింది సమస్యలు ఉన్నవారు దీనికి దూరంగా ఉండాలి లేదా డాక్టర్ సలహా తీసుకోవాలి.. తక్కువ రక్తపోటు: దానిమ్మ రక్తపోటును తగ్గిస్తుంది. కాబట్టి ఇప్పటికే లో బీపీ ఉన్నవారు దీనిని అధికంగా తీసుకోకూడదు. మందులు వాడుతున్న వారు: కొన్ని రకాల మందుల ప్రభావాన్ని దానిమ్మ మారుస్తుంది. ఏదైనా దీర్ఘకాలిక వ్యాధికి చికిత్స పొందుతున్న వారు జాగ్రత్త వహించాలి. అలెర్జీ: కొంతమందికి దానిమ్మ తింటే దురద, వాపు, వాంతులు అవుతాయి. అటువంటి వారు వెంటనే మానేయాలి. మధుమేహం: షుగర్ లెవల్స్ ఎక్కువగా ఉన్నవారు దానిమ్మను పరిమితంగానే తీసుకోవాలి.

# ప్రాథమిక అభ్యాస అధ్యయనం ఎఫ్ఎల్ఎస్ మోడల్ పరీక్షలు నిర్వహించాలి

**కరీంనగర్ :** ప్రాథమిక పాఠశాల విద్యార్థుల చదువును అంచనా వేసే అధ్యయనం ఫౌండేషనల్ లెర్నింగ్ స్టడీ లో భాగంగా విద్యార్థులకు మాక్ పరీక్షలు నిర్వహించాలని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి అన్నారు. కరీంనగర్ రూరల్ మండలం దుర్శేడు మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల, గోపాలపూర్ మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలను జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి సందర్శించారు. 3వ తరగతి విద్యార్థులతో గణితం, ఆంగ్ల పాఠాలు చదివించారు. ఫౌండేషనల్ లెర్నింగ్ స్టడీ కి సంబంధించిన మోడల్ టెస్ట్ పేపర్లలోని పలు ప్రశ్నలను అడుగుతూ విద్యార్థుల నుండి సమాధానాలు రాబట్టారు. ప్రతి విద్యార్థితో పాఠాన్ని చదివిస్తూ స్పష్టంగా అర్థవంతంగా చదివేందుకు మెళకువలు నేర్పారు. ప్రతి విద్యార్థి నోట్ బుక్ లో రైటింగ్ తీరును పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ. ఫౌండేషనల్ లెర్నింగ్ స్టడీలో భాగంగా జిల్లాలోని ఏ పాఠశాలలోనైనా విద్యార్థులకు ర్యాండడమైజేషన్ విధానంలో పరీక్షలు జరుగుతాయని, అందువల్ల ప్రతి విద్యార్థి పై ప్రత్యేక శ్రద్ధతో ఎఫ్.ఎల్.ఎస్ కి సిద్ధం చేయాలని అన్నారు. విద్యార్థులకు తరచూ మాక్ టెస్టులు నిర్వహించాలని ఆదేశించారు. మండల విద్యాధికారులు ఎప్పటికప్పుడు ఈ అంశంపై సమీక్ష నిర్వహించాలని ఉపాధ్యాయులకు సూచనలు ఇవ్వాలని ఆదేశించారు. బుధవారం బోధన కార్యక్రమానికి ప్రాధాన్యత ఇస్తూ కఠినమైన పాఠాల పట్ల దృష్టి పెట్టాలని ఉపాధ్యాయులను ఆదేశించారు. విద్యా సంవత్సరం కొద్దికాలమే ఉన్నందున ప్రతి విద్యార్థి పై శ్రద్ధ తీసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో విద్యాశాఖ క్వాలిటీ కోఆర్డినేటర్ అశోక్ రెడ్డి, మండల విద్యాధికారి వాసవి పాల్గొన్నారు.



# ప్రచారం ముగిసిన తరువాత మున్సిపల్ పరిధిలో ఓటరు కానీ వ్యక్తులు ఉండరాదు

**జగిత్యాల :** మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో, ఎన్నికల ప్రచారం ముగిసిన అనంతరం సంబంధిత మున్సిపల్ పరిధిలో ఓటర్లు కాని వ్యక్తులు ఎవరూ ఉండరాదని జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ స్పష్టం చేశారు. ఎన్నికల నిబంధనల ప్రకారం, ప్రచార గడువు ముగిసిన తర్వాత ఇతర ప్రాంతాలకు చెందిన రాజకీయ కార్యకర్తలు, మద్దతుదారులు, ప్రచారకులు మున్సిపల్ పరిధిని తక్షణమే విడిచి వెళ్లాలని అన్నారు. నిబంధనలకు విరుద్ధంగా ఎవరైనా కొనసాగితే, వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని అన్నారు. ఎన్నికల సమయంలో ప్రలోభాలకు గురి చేసే చర్యలు, డబ్బు, మద్యం, బహుమతులు పంపిణీ చేయడం వంటి అక్రమ కార్యకలాపాలపై జీరో టాలరెన్స్ విధానం అమలు చేయనున్నట్లు తెలిపారు. ఈ తరహా చర్యలకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తప్పవని స్పష్టం చేశారు.



అలాగే, శాంతి భద్రతలకు భంగం కలిగించే అవకాశం ఉన్న రౌడీ షీటర్లు, అసాంఘిక శక్తులపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి నిరంతర పర్యవేక్షణ కొనసాగిస్తామని తెలిపారు. ఎన్నికల నియమావళి ప్రకారం, ప్రచార గడువు ముగిసిన తర్వాత సామాజిక మాధ్యమాల ద్వారా ఎన్నికల ప్రచారం పూర్తిగా నిషేధించబడిందని, వాట్సాప్, ఫేస్బుక్, ఇన్స్టాగ్రామ్ వంటి ప్లాట్ఫామ్లపై కూడా నిఘా కొనసాగుతుందని పేర్కొన్నారు. ప్రజలు స్వేచ్ఛాయుతంగా తమ ఓటు హక్కును వినియోగించుకునేలా ఎన్నికలు నిర్వహించడమే జిల్లా పోలీస్ శాఖ ప్రధాన లక్ష్యమని తెలిపారు. ఎన్నికల సమయంలో శాంతి భద్రతల పరిరక్షణ కోసం పోలీస్ శాఖ ప్రత్యేక చర్యలు చేపట్టిందని పేర్కొన్నారు.ఎన్నికల నియమావళిని ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా పాటించి, పోలీస్ శాఖకు సహకరించాలని ఎస్పీ ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

# రెండు రోజుల పాటు మద్యం దుకాణాలు బంద్

**హైదరాబాద్ :** తెలంగాణ వ్యాప్తంగా రెండు రోజులపాటు మద్యం దుకాణాల బంద్‌కు అధికారులు ఆదేశాలు జారీ చేశారు. తెలంగాణలో జరగనున్న మున్సిపల్ ఎన్నికల దృష్ట్యా శాంతిభద్రతల పరిరక్షణ, ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించేందుకు వీలుగా అన్ని మున్సిపాలిటీల పరిధిలోని వైన్స్, బార్లను 2 రోజుల పాటు మూసివేయనున్నారు. ఫిబ్రవరి 9వ తేదీ సాయంత్రం 5 గంటల నుండి 11వ తేదీ సాయంత్రం 5 గంటల వరకు మద్యం అమ్మకాలను ఆ ప్రాంతాల్లో పూర్తిగా నిషేధించారు.అంతేకాకుండా, మున్సిపల్ ఎన్నికల ఫలితాలు వెలువడే ఫిబ్రవరి 13వ తేదీన కూడా మద్యం దుకాణాలు మూసివేయాలని ఎన్నికల అధికారులు, ఆబ్కారీ శాఖ అధికారులు స్పష్టం చేశారు. ఈ నిబంధనలను అతిక్రమించి ఎవరైనా మద్యం విక్రయిస్తే వారిపై కఠిన చర్యలు తీసుకోవడంతో పాటు లైసెన్సులను రద్దు చేస్తామని హెచ్చరించారు. ఓటర్లను ప్రభావితం చేయకుండా, ఎన్నికల సమయంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా అధికారులు ఈ నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించారు.తెలంగాణలో జరగనున్న మున్సిపల్ ఎన్నికలకు రాష్ట్ర ఎన్నికల సంఘం కొన్ని రోజుల కిందట నోటిఫికేషన్ విడుదల చేసింది. ఈ ఎన్నికల నోటిఫికేషన్ ద్వారా రాష్ట్రంలోని 116 మున్సిపాలిటీలు, 7 మున్సిపల్ కార్పొరేషన్లకు (కరీంనగర్, రామగుండం, నిజామాబాద్, మహబూబ్‌నగర్, మంచిర్యాల, కొత్తగూడెం, నల్గొండ) కలిపి మొత్తం 123 పట్టణ స్థానిక సంస్థలలో 2,996 వార్డులకు ప్రతినిధులను ఎన్నుకోనున్నారు. ఎన్నికల నిబంధనల ప్రకారం, పోలింగ్ ప్రారంభమయ్యే 48 గంటల ముందు ప్రచారం ముగుస్తుంది. ఫిబ్రవరి 11న ఉదయం 7 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు పోలింగ్ జరగనుంది కనుక, ఫిబ్రవరి 9వ తేదీన సాయంత్రం 5 గంటలకు అధికారికంగా ప్రచారం ముగించాలి. ఫిబ్రవరి 13న ఓట్ల లెక్కింపు చేపట్టి విజేతలను ప్రకటిస్తారు. ఈ ఎన్నికలలో మొత్తం 52.43 లక్షల మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. ఇటీవల గ్రామ పంచాయతీ ఎన్నికలు జరగగా మెజార్టీ స్థానలను అధికార కాంగ్రెస్ పార్టీ కైవసం చేసుకుంది. మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ కు గట్టి పోటీ ఇవ్వాలని బీఆర్ఎస్, బీజేపీ భావిస్తున్నాయి.తెలంగాణ మున్సిపల్ ఎన్నికల్లో సామాజిక న్యాయం పాటించేలా కాంగ్రెస్ ప్రభుత్వం, పురపాలక శాఖ రిజర్వేషన్లను ఖరారు చేశాయి. మొత్తం వార్డులలో 50 శాతం స్థానాలను మహిళలకు కేటాయించడం ఈ రిజర్వేషన్లలో అత్యంత కీలకమైన అంశం. ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్లను వారి జనాభా ప్రాతిపదికన నిర్ణయించగా, బీసీలకు 34 శాతానికి మించకుండా రిజర్వేషన్లు కల్పించారు. మున్సిపల్ చైర్మన్, మేయర్ పదవులకు సంబంధించి కూడా ఇదే నిష్పత్తిని పాటిస్తూ లాటరీ పద్ధతి ద్వారా రిజర్వేషన్లను ఖరారు చేశారు.వార్డుల విభజన, ఓటర్ల జాబితా ఆధారంగా ఏయే వార్డు ఏ వర్గానికి కేటాయించారో ఇప్పటికే జిల్లా గెజిట్లలో ప్రచురించారు. బీసీ రిజర్వేషన్ల కోసం ప్రత్యేకంగా కుల గణన డేటాను కూడా ప్రామాణికంగా తీసుకున్నారు.




# కాంగ్రెస్ పార్టీని ఓడించండి

**వరంగల్ :** అన్న ఎన్టీఆర్‌ను, ఆ తర్వాత చంద్రబాబు, వైఎస్సార్, కిరణ్ కుమార్ రెడ్డి, కేసీఆర్‌లను చూశామని, కానీ రేవంత్ రెడ్డి లాంటి ముఖ్యమంత్రిని మనం చూడలేదని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ వ్యాఖ్యానించారు. హామీల గురించి అడిగితే 'లాగులో తొండలు విడిచిపెడుతా', 'గుడ్లు పీకి గోటీలు ఆడుతా', 'పేగులు తీసుకుని మెడలో వేసుకుంటా' అని అంటున్నారని, కానీ ఇంతమంది ముఖ్యమంత్రులను మనం చూసినా వారెవరూ ఇలా మాట్లాడలేదని అన్నారు.భూపాలపల్లి, పరకాలలో నిర్వహించిన మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో కేటీఆర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, జయశంకర్ భూపాలపల్లి జిల్లాను రద్దు చేయనని ముఖ్యమంత్రి చెబుతున్నారని, అసలు ఆయన రద్దు చేయడానికి, జిల్లాను ఆయన చేశాడా అని ప్రశ్నించారు. జిల్లాను రద్దు చేస్తే భూపాలపల్లి ప్రజలు వీపు చింతపండు చేస్తారని కేటీఆర్ అన్నారు.మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌ను తిడితే ఊరుకునేది లేదని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని హెచ్చరించారు. "నీ టైమ్ అంతా రెండేళ్లే. ఆ తర్వాత గులాబీ జెండా ఎగురుతుంది. ఆ తర్వాత నువ్వు పాతాళంలో దాక్కున్నా వదిలి పెట్టం, పొట్టోడా. కేసీఆర్‌తో పాటు మా కార్యకర్తలను అంటే ఊరుకునేది లేదు" అని అన్నారు. తిడితే తనను, ఇతర నాయకులను తిట్టుకోవచ్చని, కానీ కేసీఆర్‌ను, బీఆర్ఎస్ కార్యకర్తలను తిడితే మాత్రం ఊరుకునేది లేదని హెచ్చరించారు.ఎంతమంది దేవుళ్లు ఉంటే అంతమంది దేవుళ్లను మొక్కుకున్నా అధికారంలోకి వచ్చాక వదిలి పెట్టేది లేదని అన్నారు. ఆయన పేరు అనుముల రేవంత్ రెడ్డి కాదని, లాగుల తొండల్ రెడ్డి అని ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ నేతలు రాష్ట్రంలో పాలన పక్కకు పెట్టి కుంభకోణాలకు తెరలేపారని ఆరోపించారు. అధికారంలోకి వచ్చి రెండేళ్లు దాటినా ఇప్పటి వరకు ఒక్క అభివృద్ధి పని కూడా జరగలేదని విమర్శించారు.సింగరేణిని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, బావమరిది కలిసి దోచుకున్నారని ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీకి ఓటేస్తే ప్రజలను ఆ పార్టీ నాయకులు ముంచుతారని హెచ్చరించారు. రూ.4 వేల పెన్షన్, తులం బంగారం, రైతుబంధు పెంపు ఏ ఒక్క హామీని నెరవేర్చలేదని మండిపడ్డారు. మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని ఓడిస్తే హామీలు అమలవుతాయని ఓటర్లకు సూచించారు.

## మధిర అంటే నాకు ప్రాణం ఉప ముఖ్యమంత్రి భట్టి


**మధిర :** నన్ను నాలుగు సార్లు ఎమ్మెల్యేగా గెలిపించి, ఈ రాష్ట్రానికి ఉపముఖ్యమంత్రిగా సేవ చేసే అవకాశం కల్పించిన మీ రుణం తీర్చుకోవడమే నా ఏకైక లక్ష్యమని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అన్నారు. సోమవారం అయన ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. భట్టి మాట్లాడుతూ మధిర కీర్తి ప్రతిష్టలను పెంచుతూ, మరో 50 ఏళ్ల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని అద్భుతమైన పట్టణాన్ని నిర్మించే బాధ్యతను నేను తీసుకుంటున్నానని అన్నారు. హైదరాబాద్, అమెరికా తరహాలో మధిరలో అత్యున్నత వైద్య రక్షణ సదుపాయాలు కల్పిస్తాం. రెప్పపాటు కూడా కరెంటు పోకుండా అండర్ గ్రౌండ్ విద్యుత్ వ్యవస్థను, స్వచ్ఛమైన నగరం కోసం అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులను వేగవంతం చేస్తున్నాం. పట్టణ విస్తరణకు కీలకమైన ఔటర్ రింగ్ రోడ్డు పనుల కోసం ఇప్పటికే నిధులు జమ చేశామని అన్నారు. వర్షపు నీరు, మురుగు నీటి తరలింపునకు ప్రత్యేక మార్గాలు నిర్మిస్తూనే, వరద ముంపు నుంచి శాశ్వత పరిష్కారం కోసం రిటైనింగ్ వాల్ మరియు బ్రిడ్జిల నిర్మాణం చేపడుతున్నాం. మన బిడ్డలు పోటీ పరీక్షలకు మధిరలోనే సిద్ధమయ్యేలా అంబేద్కర్ నాలెడ్జ్ సెంటర్ ఏర్పాటు చేస్తున్నాం. మహిళలు పారిశ్రామికవేత్తలుగా ఎదిగేందుకు ప్రత్యేక శిక్షణ, లోన్లు మరియు ఇండస్ట్రియల్ పార్కులో స్థలాలు కేటాయిస్తాం. ఇల్లు లేని పేదలకు ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం. డంపింగ్ యార్డ్ తొలగించి వైరా నది పరివాహక ప్రాంతాన్ని పార్కులు, వాకింగ్ ట్రాక్లతో సుందరంగా తీర్చిదిద్దుతామని అన్నారు. ఈ అభివృద్ధి పనుల్లో వీసమెత్తు అవినీతి జరగకుండా నేనే స్వయంగా నాణ్యతను పర్యవేక్షిస్తాను. అభివృద్ధి అంటే మధిర అన్నట్టుగా రాష్ట్రానికే రోల్ మోడల్గా నిలుపుతానని అన్నారు.

## సత్తుపల్లి, కల్లూరు మున్సిపాలిటీలు కైవసం చేసుకుంటాం.. మాజీ ఎమ్మెల్యే సండ్ర..

**సత్తుపల్లి :** సత్తుపల్లి నియోజకవర్గంలోని సత్తుపల్లి, కల్లూరు మున్సిపాలిటీల్లో బీఆర్ఎస్ పార్టీ విజయం సాధిస్తుందని మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకట వీరయ్య ధీమా వ్యక్తం చేశారు. ప్రజల్లో తమపై ఉన్న విశ్వాసమే దీనికి నిదర్శనమన్నారు. ప్రత్యర్థి పార్టీల ర్యాలీలకు సరైన ఆదరణ లేదని, వారి ప్రసంగాల్లోనే ఓటమిని అంగీకరించారని విమర్శించారు.గత రెండేళ్లలో పాలకుల మార్క్ అభివృద్ధి ఎక్కడా కనిపించలేదని, రైతు బంధు, పెన్షన్ పెంపు, తులం బంగారం వంటి హామీలు అమలు కాలేదన్నారు. షాదీఖానా, మినీ స్టేడియం, సామాజిక భవనాల నిర్మాణాలు నిలిచిపోయాయని, 100 పడకల ఆసుపత్రి పూర్తయినా ప్రజలకు అందుబాటులోకి తీసుకురాలేదని ఆరోపించారు. సింగరేణి బాధితులకు ఒక్క ఇల్లు కూడా కట్టించలేదని ప్రశ్నించారు.తమపై అసత్య ఆరోపణలు చేస్తున్నారని, తాను ఎప్పుడూ జూదం ఆడలేదని స్పష్టం చేశారు. గత 15 ఏళ్లుగా ప్రజలకు సేవ చేసినట్లే ఇకముందు కూడా ప్రజల మధ్యలోనే ఉంటానన్నారు. సత్తుపల్లి, కల్లూరు మున్సిపాలిటీ ఓటర్లు ఆలోచించి బీఆర్ఎస్ అభ్యర్థులను గెలిపించాలని సండ్ర వెంకట వీరయ్య విజ్ఞప్తి చేశారు.

## 88 అధికార పార్టీకి ఓటేసి వనపర్తిని అభివృద్ధి,పరుచుకుందాం.

ఎమ్మెల్యే సతీమణి తూడిశారదామేఘారెడ్డి.



**వనపర్తి :** మున్సిపల్ ఎన్నికల సందర్భంగా వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి సతీమణి తూడి శారదామేఘారెడ్డి వనపర్తి పట్టణంలోని 33 వార్డులో ఇంటింటి ప్రచారం చేపట్టారు.33 వ వార్డు అభ్యర్థి అయిన నాఒఔ మాధవిరమేష్ ని గెలిపించాలని కోరుతూ తూడి శారద మేఘారెడ్డి ఇంటింటి ప్రచారం చేపట్టారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే సతీమణి తూడి శారదామేఘారెడ్డి మాట్లాడుతూ..కాంగ్రెస్ ప్రభుత్వంలో వనపర్తి పట్టణంలోని ప్రతి వార్డులో ఇందిరమ్మ ఇండ్లు, రేషన్ కార్డులు, మహిళలకు ఉచిత ఆర్టీసీ ప్రయాణం, మహిళా సంఘాలకు వడ్డీ లేని రుణాలు, మహిళలకు కుట్టు మిషన్ల పంపిణీ, మహిళలను గౌరవించుకునే విధంగా ఇందిరమ్మ చీరలు పంపిణీ లాంటి అనేక సంక్షేమ పథకాలను చేపట్టి నిరుపేదలకు తోడుగా కాంగ్రెస్ పార్టీ మరియు ఎమ్మెల్యే తూడి మేఘరెడ్డి గారు ఎల్లవేళలా తోడు ఉంటారు.33 వార్డులో నిత్యం ప్రజల మధ్యలోనే ఉంటూ ప్రజా సమస్యలను ఎమ్మెల్యే తుడి మేఘారెడ్డి ద్వారా పరిష్కరిస్తున్న నాఒఔ మాధవిరమేష్ ను హస్తం గుర్తుపై ఓటు వేసి భారీ మెజార్టీతో గెలిపించాలని ఎమ్మెల్యే సతీమణి తూడి శారదా మేఘారెడ్డి పేర్కొన్నారు.ఈ ప్రచార కార్యక్రమంలో వార్డ్ కాంగ్రెస్ కౌన్సిలర్ నాఒఔ మాధవిరమేష్, ప్రజా వైద్యులు పగిడాల శ్రీనివాసులు పార్టీ నాయకులు, కార్యకర్తలు, మహిళలు, యువకులు, పెద్దలు, పార్టీ శ్రేణులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## ర్యాండమైజేషన్ ద్వారా పోలింగ్ సిబ్బంది కేటాయింపు జిల్లా కలెక్టర్ కె. హైమవతి




**సిద్దిపేట :** ఈ నెల 11 జరుగనున్న మున్సిపల్ ఎన్నికల పోలింగ్ సిబ్బందిని జిల్లా కలెక్టర్ కె. హైమవతి ర్యాండమైజేషన్ ద్వారా కేటాయించారు. సాధారణ మున్సిపల్ ఎన్నికలు 2026 నిర్వహణలో భాగంగా సోమవారం కలెక్టర్ కార్యాలయంలో జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో మున్సిపల్ ఎన్నికల జిల్లా సాధారణ పరిశీలకులు ఆయేషా మస్రత్ ఖానం సమక్షంలో జిల్లాలో ఎన్నికలు జరగనున్న చేర్యాల, హుస్నాబాద్, దుబ్బాక, గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీల ఎన్నికల పోలింగ్ ప్రిసైడింగ్, అసిస్టెంట్ ప్రిసైడింగ్ మరియు అదర్ పోలింగ్ సిబ్బందిని ర్యాండమైజేషన్ పద్ధతిలో ఆన్లైన్ లో కేటాయించారు. చేర్యాల మున్సిపాలిటీకి 147 మంది సిబ్బందిని, హుస్నాబాద్ మున్సిపాలిటీకి 240 మంది సిబ్బందిని, దుబ్బాక మున్సిపాలిటీకి 246 మంది సిబ్బందిని, గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీకి 436 మంది సిబ్బందిని ర్యాండమైజేషన్ ద్వారా కేటాయించారు.
ఈ కార్యక్రమంలో కలెక్టరేట్ ఏవో రాజ్ కుమార్, డిఆర్డీఓ జయదేవ్ ఆర్యా, డీఈవో శ్రీనివాస్ రెడ్డి, ఎన్నికల సిబ్బంది. ఎలక్షన్ విభాగం అధికారులు, ఈడియం ఆనంద్ మరియు టెక్నికల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## బిజినెస్

### ప్రభుత్వానికి టెలికాం కంపెనీలు చెల్లించాల్సిన బకాయి రూ. 1.77 లక్షల కోట్లు




2024-25 ఆర్థిక సంవత్సరం నాటికి భారత ప్రభుత్వానికి టెలికాం కంపెనీలు చెల్లించాల్సిన సర్దుబాటు చేసిన స్థూల రాబడి(ఏజీఆర్) బకాయిలు రూ. 1.77 లక్షల కోట్లకు పైగా ఉన్నాయి. ఈ మేరకు అధికారిక డేటా వివరాలను ప్రభుత్వం పార్లమెంటుకు తెలియజేసింది. దీని ప్రకారం, అప్పుల ఊబిలో ఉన్న ప్రైవేట్ రంగ వొడాఫోన్ ఐడియా (వీఐ) మొత్తం రూ. 89,952 కోట్లు, భారతీ గ్రూప్ రూ. 51,091 కోట్లు, టాటా గ్రూప్‌పై రూ. 20,426 కోట్లు, ఎంటీఎన్ఎల్‌పై రూ. 14,462 కోట్లు, రిలయన్స్ జియో ఇన్ఫోకామ్‌పై రూ. 1,984 కోట్ల బకాయి చెల్లించాల్సి ఉంది. ఇందులో వొడాఫోన్ ఐడియాకు చెందిన 2006-07 ఆర్థిక సంవత్సరం నుంచి 2018-19 ఆర్థిక సంవత్సరం వరకు ఉన్న ఏజీఆర్ బకాయిలు రూ. 87,695 కోట్లను ఫ్రీజ్ చేశారు. అంటే, చెల్లింపు ప్రక్రియ వాయిదాలో ఉంది. దీనికి సంబంధించి వీఐ బకాయిలను పునఃపరిశీలన కోసం జనవరి 30న టెలికాం విభాగం ఓ కమిటీని ఏర్పాటు చేసిందని ప్రభుత్వం పార్లమెంటుకు తెలియజేసింది. ఈ కమిటీలో భారత ప్రభుత్వానికి చెందిన రిటైర్‌మెంట్ కార్యదర్శి స్థాయి అధికారి, కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ ఆఫ్ ఇండియా (కాగ్) నామినేట్ చేసిన ఓ ప్రతినిధి ఉంటారు. ఈ కమిటీ తీసుకున్న నిర్ణయమే తుది ఫలితం కానుంది. అందుకు అనుగుణంగా నిర్ణయం ఉంటుందని ప్రభుత్వం వెల్లడించింది.

### వాణిజ్య ఒప్పంద ప్రభావం పడొచ్చు




మధ్యంతర వాణిజ్య ఒప్పందంపై వెలువడిన భారత్-అమెరికా సంయుక్త ప్రకటన ప్రభావం ఈవారం మన స్టాక్ మార్కెట్లపై ఉంటుంది. మన వస్తువులపై అమెరికా టారిఫ్‌లు 50% నుంచి 18 శాతానికి తగ్గుతాయి. సముద్ర ఉత్పత్తులు, జౌళి, ఇతర కార్మిక ఆధారిత రంగాలకు ప్రయోజనం కలగనుంది. సాంకేతికంగా చూస్తే నిఫ్టీ-50కి 25,500 పాయింట్ల వద్ద మద్దతు, 25,750 వద్ద నిరోధం కనిపించొచ్చు. ఐడీబీఐ బ్యాంక్‌లో మెజారిటీ వాటా కొనుగోలుకు కోటక్ మహీంద్రా బ్యాంక్, ఫెయిర్‌ఫాక్స్ వంటివి ఆర్థిక బిడ్‌లు సమర్పించనున్న నేపథ్యంలో, ఈ పరిణామాలపై మదుపర్లు దృష్టి సారించొచ్చు. టాటా స్టీల్ మెరుగైన ఫలితాల నేపథ్యంలో ఆ సంస్థ షేర్లు వెలుగులోకి రావొచ్చు. విదేశీ మదుపర్ల ధోరణి కీలకం కానుంది. వరుసగా 3 నెలల పాటు భారీగా విక్రయాలు జరిపిన విదేశీ పోర్టుఫోలియో మదుపర్లు, ఈ నెల తొలివారంలో రూ.8,129 కోట్ల నికర కొనుగోళ్లు జరపడం గమనార్హం.

# ఎస్బీఐలో 10.05 శాతం వడ్డీకే




మనకు ఎప్పుడు ఏ అవసరం పడుతుందో చెప్పలేం. పెళ్లి కోసమో లేదా వెకేషన్ కోసమో.. లేదా ఉన్నట్లుండి ఆస్పత్రిలో చేరాల్సి వస్తే ఖర్చులకు, ఇతర ఎమర్జెన్సీ అవసరాలకు డబ్బు కావాల్సి వస్తుంది.మన దగ్గర లేకపోతే బంధువులనో.. స్నేహితులనో అడుగుతుంటాం. అక్కడ దొరక్కపోతే ఇక బ్యాంకుల్లో లోన్ తీసుకోవడానికే చూస్తుంటామని చెప్పొచ్చు. ఒకప్పటితో పోలిస్తే ఇప్పుడు చాలా మంది చిన్న అవసరాల కూడా బ్యాంకుల్ని ఆశ్రయిస్తున్నారు. ప్రాసెస్ కూడా ఒకప్పటితో పోలిస్తే వేగంగా జరుగుతుంది. పెద్దగా డాక్యుమెంటేషన్ పని లేకుండానే క్షణాల్లో అకౌంట్లో డబ్బులు జమ చేస్తున్నాయి. కొన్ని బ్యాంకులు ప్రీఅప్రూవ్డ్ లోన్స్ ఆఫర్ చేస్తూ.. బ్యాంకుకు వెళ్లాల్సిన అవసరం లేకుండానే లోన్స్ అందిస్తున్నాయి. కొంత కాలంగా ఆర్బీఐ కీలక రెపో రేట్లను తగ్గిస్తూ వచ్చిన సంగతి తెలిసిందే. గతేడాది ఏకంగా 125 బేసిస్ పాయింట్ల మేర రెపో రేటును తగ్గించగా.. బ్యాంకులు అందుకు అనుగుణంగా రెపో ఆధారిత వడ్డీ రేట్లను తగ్గించాయి. రెపోకు లింక్ అయి ఉన్న పర్సనల్ లోన్, హోం లోన్, వెహికిల్ లోన్ వంటి వాటి వడ్డీ రేట్లు తగ్గుముఖం పట్టాయి. ఈ క్రమంలో ఎస్బీఐలో కూడా లోన్ వడ్డీ రేట్లు తగ్గాయి. గతంలో కంటే తక్కువ వడ్డీ రేటుకే ఇప్పుడు లోన్లు లభిస్తున్నాయని చెప్పొచ్చు. ఎస్బీఐలో పర్సనల్ లోన్ అనేది రెండేళ్ల టెన్యూర్ ఎంసీఎల్ఆర్‌కు లింక్ అయి ఉంటుంది. ఈ బ్యాంకులో ఇప్పుడు పర్సనల్ లోన్ వడ్డీ రేట్లు కనీసం 10.05 శాతం నుంచే ప్రారంభమవుతున్నాయి. గరిష్ఠ వడ్డీ రేటు 15.05 శాతంగా ఉంది. ప్రభుత్వ ఉద్యోగులు, డిఫెన్స్, పారా మిలిటరీ, ఇండియన్ కోస్ట్ గార్డ్స్ సిబ్బందికి చాలా తక్కువ వడ్డీకే లోన్లు లభిస్తాయి. ఇంకా మెరుగైన సిబిల్ స్కోరు ఉన్న ప్రైవేట్ ఉద్యోగులకు కూడా కనీస వడ్డీ రేటుకే లోన్ లభించే అవకాశం ఉంటుంది. స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా వెబ్‌సైట్ ప్రకారం.. రూ. 35 లక్షల వరకు పర్సనల్ లోన్ పొందొచ్చు. ప్రాసెసింగ్ ఫీజులు కూడా ఎక్కువేం ఉండవు. పెద్దగా డాక్యుమెంటేషన్ ఉండదు. హిడెన్ కాస్ట్స్ ఏం లేవు. ఇప్పుడు మనం ప్రారంభ వడ్డీ రేటుతో అలాగే.. 11 శాతం, 12 శాతం వడ్డీ రేటుతో రూ. 5 లక్షల పర్సనల్ లోన్ తీసుకుంటే ఈఎంఐ ఎంత చెల్లించాలో చూద్దాం. రూ. 5 లక్షల లోన్ తీసుకుంటే.. మూడేళ్లకు 10.05 శాతం ప్రారంభ వడ్డీ రేటు చొప్పున నెలకు ఈఎంఐ రూ. 16,145 చొప్పున పడుతుంది. మొత్తం టెన్యూర్‌కు రూ. 81,232 వడ్డీ చెల్లించాల్సి వస్తుంది. ఇదే 11 శాతం వడ్డీ రేటుకు చూస్తే నెలకు ఈఎంఐ రూ. 16,369 గా ఉండగా.. మొత్తం వడ్డీ రూ. 89,297 చెల్లించాలి. 12 శాతానికి చూస్తే మూడేళ్లలో నెలకు ఈఎంఐ రూ. 16,607 పడుతుంది. మొత్తం వడ్డీ రూ. 97,858 పడుతుంది.

# రష్యా ముడిచమురు దిగుమతులకు బ్రేక్!



గత ఏడాది కాలంగా భారత ఇంధన మార్కెట్‌లో రష్యా గుత్తాధిపత్యం స్పష్టంగా కనిపిస్తూ వచ్చింది. 2025 జూన్ నాటికి భారత్‌కు రష్యా నుంచి వచ్చే క్రూడాయిల్ ఇంపోర్ట్స్ రికార్డు స్థాయిలో రోజుకు 20 లక్షల బ్యారెళ్లకు చేరుకున్నాయి. ఆ సమయంలో భారత మొత్తం చమురు దిగుమతుల్లో రష్యా వాటా దాదాపు 44 శాతంగా నమోదై అగ్రగామిగా నిలిచింది. తక్కువ ధరకు చమురు లభిస్తుండటంతో భారతీయ రిఫైనరీలు రష్యా వైపే మొగ్గు చూపాయి.అయితే, 2025 నవంబర్ తర్వాత పరిస్థితి ఒక్కసారిగా తలకిందులైంది. అంతర్జాతీయ స్థాయిలో అమెరికా విధించిన కఠినమైన ఆర్థిక ఆంక్షలు మరియు మారుతున్న అంతర్జాతీయ వాణిజ్య నిబంధనలు భారత చమురు దిగుమతులపై తీవ్ర ప్రభావాన్ని చూపాయి. ముఖ్యంగా రష్యా నుంచి వచ్చే చమురు రవాణాపై ఉన్న పరిమితులు మరియు లాజిస్టిక్స్ సమస్యల కారణంగా భారతీయ కంపెనీలు తమ వ్యూహాన్ని మార్చుకోవాల్సి వచ్చింది. దీనివల్ల గతంలో ఉన్న జోరు కాస్తా తగ్గడం ప్రారంభమైంది.తాజా గణాంకాల ప్రకారం, జనవరి 2026 నాటికి రష్యా చమురు వాటా సగానికి సగం పడిపోయి 22 శాతానికి పరిమితమైంది. ప్రస్తుతం రోజువారీ దిగుమతులు 11.6 లక్షల బ్యారెళ్లకు చేరుకున్నాయంటే, మార్కెట్‌లో వచ్చిన మార్పు ఎంత తీవ్రంగా ఉందో అర్థం చేసుకోవచ్చు. గతంలో ఎన్నడూ లేని విధంగా అతి తక్కువ కాలంలోనే ఇంతటి భారీ పతనం సంభవించడం ఇంధన రంగంలో చర్చనీయాంశంగా మారింది. ఇది ఇతర దేశాల నుంచి చమురు దిగుమతులు పెరిగేందుకు దారితీసింది. దిగుమతులు భారీగా తగ్గినప్పటికీ, ఇప్పటికీ భారత ఇంధన అవసరాల సరఫరాలో రష్యా ఒక కీలక భాగస్వామిగానే కొనసాగుతోంది. అంతర్జాతీయ ఒత్తిళ్లు ఉన్నప్పటికీ, భారత్ తన ఇంధన భద్రతను కాపాడుకోవ డానికి ప్రత్యామ్నాయ మార్గాలను వెతుకుతోంది. భవిష్యత్తులో ధరల వ్యత్యాసం మరియు అంతర్జాతీయ పరిణామాలను బట్టి ఈ దిగుమతుల శాతంలో మరిన్ని మార్పులు వచ్చే అవకాశం ఉందని విశ్లేషకులు

## రాహుల్ సెంచరీతో ముంబై ఇంటికి..

# రంజీ సెమీఫైనల్లో కర్నాటక!

భారత జట్టుకే కాదు దేశవాళీలోనూ తాను ఆపద్బాంధవుడిని అని చాటుకున్నాడు కేఎల్ రాహుల్. రంజీ ట్రోఫీ క్వార్టర్ ఫైనల్లో ఈ క్లాస్ బ్యాటర్ సెంచరీతో గర్జించాడు. ముంబై బౌలర్లను చితక్కొడుతూ శతకంతో కర్నాటకను సెమీ ఫైనల్ చేర్చాడు. 325 పరుగుల ఛేదనలో రెచ్చిపోయిన రాహుల్ మ్యాచ్ విన్నింగ్ ఇన్నింగ్స్‌తో 42 సార్లు ఛాంపియన్ ముంబైని ఇంటికి పంపాడు. దాంతో.. 11 ఏళ్ల తర్వాత టైటిల్ వేటకు అడుగు దూరంలో నిలిచింది కర్నాటక. రంజీ ట్రోఫీ క్వార్టర్ ఫైనల్లో కేఎల్ రాహుల్ తన తడాఖా చూపించాడు. ముంబై నిర్దేశించిన భారీ ఛేదనలో మూడంకెల స్కోర్‌తో కర్నాటకను సెమీస్ తీసుకెళ్లాడు. ఎంసీఏ బీకేసీ మైదానంలో నాలుగో రోజు మయాంక్ అగర్వాల్(3) విఫలమవ్వగా.. రాహుల్‌నే నమ్ముకుంది కర్నాటక. శార్దూల్ ఠాకూర్, తుషార్ పాండే ఓవర్లో చెత్త బంతులను శిక్షించి లక్ష్యాన్ని కరిగించాడు. రాహుల్(130)కు కెప్టెన్ దేవ్‌దత్ పడిక్కల్(39) అండగా నిలవగా చక్కని కవర్ డ్రైవ్స్‌తో అలరించిన అతడు అర్ధ శతకం భాగస్వామ్యం నెలకొల్పాడు. అనంతరం స్మరన్ రవిచంద్రన్(83 నాటౌట్)తో కలిసి విలువైనరన్స్ జోడించిన ఈ సొగసరి బ్యాటర్ 147 బంతుల్లో శతకం పూర్తి చేసుకున్నాడు. ఫస్ట్‌క్లాస్ క్రికెట్‌లో అతడికిది 24వ సెంచరీ. రాహుల్ ఖతర్నాక్ శతకంతో నాలుగు వికెట్ల తేడాతో ముంబైని చిత్తు చేసింది కర్నాటక.

**ఆ ఇద్దరు నిలబడడంతో..**



తొలి ఇన్నింగ్స్‌లో కర్నాటకు 53 పరుగుల ఆధిక్యం సమర్పించుకున్న ముంబై.. రెండో ఇన్నింగ్స్‌లో ఛాంపియన్‌లా ఆడింది. వికెట్ కీపర్ ఆకాశ్ ఆనంద్(70) హాఫ్ సెంచరీతో మెరవగా.. ఆఖర్లో తనుష్ కొటియాన్(48 నాటౌట్), తుషార్ దేశ్‌పాండే(47)లు కర్నాటక బౌలర్లను సమర్థంగా ఎదుర్కొన్నారు. వీరిద్దరి పట్టుదలతో రెండో ఇన్నింగ్స్‌లో ముంబై 375 పరుగులు చేసి ప్రత్యర్థికి భారీ లక్ష్యాన్ని నిర్దేశించింది.

### ఇటలీపై స్కాట్లాండ్ ఘన విజయం.. జార్జ్ మున్సే సూపర్ ఇన్నింగ్స్



టీ20 ప్రపంచ కప్ 2026 (ం20 ఔశీతీశ్రీ‌ఎ జబజూ-2026) లో భాగంగా సోమవారం ఇటలీతో జరిగిన మ్యాచ్‌లో స్కాట్లాండ్ 73 పరుగుల తేడాతో ఘన విజయం సాధించింది. టాస్ ఓడి ముందుగా బ్యాటింగ్ చేసిన స్కాట్లాండ్ నిర్ణీత 20 ఓవర్లలో 207 పరుగులు చేసింది. 208 పరుగుల లక్ష్యఛేదనలో ఇటలీ.. 16.4 ఓవర్లలో 134 పరుగులకు ఆలౌటైంది. బెన్ మానెంటి (52), హెన్రీ మానెంటి (37), స్మట్స్ (22) మాత్రమే రాణించారు. స్కాట్లాండ్ బౌలర్లలో మైకేల్ లీస్క్ 4, మార్క్ వాట్ 2, బ్రాడ్ క్యూరీ, బ్రాడ్ వీల్, దేవిడ్సన్ ఒక్కో వికెట్ తీశారు. అంతకుముందు స్కాట్లాండ్ నిర్ణీత 20 ఓవర్లలో 4 వికెట్ల నష్టానికి 207 పరుగులు చేసింది. ఓపెనర్ జార్జ్ మున్సే (84) అద్భుతమైన హాఫ్ సెంచరీ చేశాడు. మరో ఓపెనర్ మైకేల్ జోన్స్ (37) పరుగులు రాబట్టాడు. ఈ జోడీ తొలి వికెట్‌కు 126 పరుగుల భాగస్వామ్యం నెలకొల్పింది. తర్వాత వచ్చిన బ్రాండన్ మెక్‌మిలన్ (41 నాటౌట్) మెరుపులు మెరిపించాడు. రిచీ బెరింగ్టన్ (15) పరుగులు చేశాడు. ఇన్నింగ్స్ చివరి ఓవర్లో మైకేల్ లీస్క్ (22) వరుసగా 4, 2, 4, 6, 6 బాదడంతో స్కోరు 200 దాటింది. ఇటలీ బౌలర్లలో అలీ హసన్, గ్రాంట్ స్టీవర్ట్, థామస్ డ్రాకా, స్మట్స్ తలో వికెట్ తీశారు.

## స్పోర్ట్స్

### ఇండియాతో ఆడాలంటే.. 3 కీలక షరతులు పెట్టిన పాకిస్థాన్ క్రికెట్ బోర్డు




**ఇస్లామాబాద్:** టీ20 వరల్డ్‌కప్‌లో ఇండియాతో ఫిబ్రవరి 15వ తేదీన జరగనున్న మ్యాచ్‌ను ఆడబోమని పాకిస్థాన్(ఝఎఅర్ఝఅ జతీఅఎఎవ్ దీశ్ఝతీఎ) చెప్పిన విషయం తెలిసిందే. అయితే ఆ మ్యాచ్‌ను నిర్వహించేందుకు ఐసీసీ తమ వంతు ప్రయత్నం చేస్తున్నది. ఈ నేపథ్యంలో ఇద్దరు సభ్యుల బృందం పాకిస్థాన్ వెళ్లింది. పాకిస్థాన్ క్రికెట్ బోర్డు చైర్మెన్ మోషిన్ నఖ్వీతో చర్చలు నిర్వహించారు. భారత్‌తో మ్యాచ్ ఆడేందుకు మూడు కీలక షరతులు పాకిస్థాన్ పెట్టినట్లు తెలుస్తోంది. ఓ మీడియా కథనం ప్రకారం ఆ షరతులు ఇలా ఉన్నాయి. పాకిస్థాన్ క్రికెట్ బోర్డుకు వార్షిక నిధులను ఐసీసీ పెంచాలని కోరింది. ఇక ఇండియా, భారత్ మధ్య ద్వైపాక్షిక సిరీస్‌లను పునరుద్ధరించాలని ఐసీసీని అభ్యర్థించింది. అయితే ఇండియా, పాక్ మధ్య మ్యాచ్ జరుగుతున్న సమయంలో.. ఆటగాళ్లు ఆన్‌ఫీల్డ్ ఎథిక్స్ పాటించాలని, ప్లేయర్లు అందరూ షేక్ హ్యాండ్ ఇచ్చుకోవాలని పాక్ క్రికెట్ బోర్డు ఐసీసీని కోరినట్లు తెలుస్తోంది. టీ20 వరల్డ్‌కప్ నుంచి బంగ్లాదేశ్‌ను బహిష్కరించిన నేపథ్యంలో ఆ దేశానికి మద్దతు ఇస్తూ ఇండియాతో ఆడేందుకు పాకిస్థాన్ నిరాకరించిన విషయం తెలిసిందే.ప్రధాని షెహబాజ్ షరీఫ్‌ను కలిసిన తర్వాత తుది నిర్ణయం వెల్లడించనున్నట్లు నఖ్వీ తెలిపారు.




## 'గాయపడ్డ సింహం' ట్రైజర్ రిలీజ్.. తరుణ్ భాస్కర్ కొత్త అవతారంలో..!

నూతన తరహా సినిమాలతో ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న దర్శకుడు తరుణ్ భాస్కర్ మరోసారి వార్తల్లో నిలిచారు. 'పెళ్లి చూపులు'తో టాలీవుడ్‌కు న్యూ ఏజ్ కథనం ఎలా ఉండాలో చూపించిన ఆయన, 'ఈ నగరానికి ఏమైంది' సినిమాతో కల్ట్ ఫాలోయింగ్ సంపాదించారు. దర్శకుడిగానే కాకుండా నటుడిగానూ వరుస చిత్రాలతో బిజీ అవుతున్న తరుణ్ భాస్కర్ ఇప్పుడు 'గాయపడ్డ సింహం' చిత్రంతో ప్రేక్షకుల ముందుకు రాబోతున్నారు. ఈ చిత్రానికి కశ్యప్ శ్రీనివాస్ దర్శకత్వం వహించగా, ఫరియా అబ్దుల్లా, మానసా చౌదరి కథానాయికలుగా నటించారు. దర్శకుడు పవన్ సాధినేని సమర్పకుడిగా వ్యవహరించడం విశేషం. ఇప్పటికే చిత్రీకరణ పూర్తి చేసుకున్న ఈ సినిమాకు సంబంధించిన టీజర్, ట్రైలర్ కలిపిన "ట్రైజర్" ను తాజాగా విడుదల చేశారు. విడుదలైన ట్రైజర్‌కు సోషల్ మీడియాలో మంచి స్పందన లభిస్తోంది. కామెడీ, వ్యంగ్యం, యాక్షన్ అంశాలను కలగలిపి సరదాగా రూపొందించినట్లు కనిపిస్తోంది. కథాంశం విషయానికి వస్తేడ అమెరికా వెళ్లాలని కలలు కనే ఓ యువకుడి జీవితంలో చోటుచేసుకునే సంఘటనల చుట్టూ సినిమా తిరుగుతుంది. వీసా రిజెక్ట్ కావడంతో అతడు ఎదుర్కొనే నిరాశ, ఫ్రస్ట్రేషన్, ఆ తర్వాత తీసుకునే నిర్ణయాలు కథకు ప్రధానాంశాలుగా ఉంటాయని ట్రైజర్ ద్వారా అర్థమవుతోంది. మధ్య మధ్యలో వచ్చే యాక్షన్ ఎపిసోడ్‌లు, కేజీఎఫ్ స్పూఫ్ సన్నివేశాలు, అమెరికా వెళ్లకపోయినా హీరో ఇచ్చే బిల్డప్ డైలాగులు వినోదాన్ని పంచుతున్నాయి. ప్రత్యేకంగా ట్రైజర్‌లో అమెరికా మాజీ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌ను సూచించే విధంగా చూపించిన సన్నివేశాలు ప్రస్తుతం వైరల్ అవుతున్నాయి. అమెరికా వీసా నిబంధనల వల్ల ఇబ్బందులు ఎదుర్కొంటున్న యువత ఆవేదనను ప్రతిబింబించే ప్రయత్నం చేసినట్లు అనిపిస్తోంది. క్యాప్షన్ ద్వారా చిత్ర బృందం కథలో ఉన్న అంతర్గత భావాన్ని స్పష్టంగా చెప్పింది. వేసవి కానుకగా ఈ చిత్రాన్ని విడుదల చేయడానికి నిర్మాతలు సిద్ధమవుతున్నారు. దర్శకుడిగా ఇప్పటికే విజయాలు అందుకున్న తరుణ్ భాస్కర్‌కు నటుడిగా ఈ సినిమా ఎలాంటి బ్రేక్ ఇస్తుందో చూడాలి. వినోదంతో పాటు సమాజంలోని యువత సమస్యలను టచ్ చేస్తూ తెరకెక్కుతున్న ఈ చిత్రం ప్రేక్షకుల్లో ఆసక్తిని రేకెత్తిస్తోంది.



## కన్నడ చిత్రసీమలోకి మీనాక్షి చౌదరి ఎంట్రీ?

టాలీవుడ్‌లో తక్కువ కాలంలోనే ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న మీనాక్షి చౌదరి, కన్నడ చిత్రసీమలోకి అడుగుపెట్టనున్నట్లు వార్తలు వస్తున్నాయి. రక్షిత్ శెట్టి నటించిన సూపర్ హిట్ చిత్రం '777 చార్లీ' సీక్వెల్‌లో ఆమెను హీరోయిన్‌గా ఎంపిక చేశారని ప్రచారం జరుగుతోంది. ఈ సినిమాకు సంబంధించిన అధికారిక ప్రకటన త్వరలోనే వెలువడే అవకాశం ఉంది. ప్రస్తుతం మీనాక్షి నాగచైతన్యతో 'వృషకర్మ'తో పాటు మరో రెండు చిత్రాల్లో నటిస్తోంది. తన పట్టుదలతో, సరైన అవకాశాలను అందిపుచ్చుకుంటూ మీనాక్షి రాబోయే రోజుల్లో ఇతర ఇండస్ట్రీల్లోనూ తన సత్తా చాటుతుందని అభిమానులు నమ్ముతున్నారు. ఇటీవల కాలంలో తెలుగులో మీనాక్షి వరుస హిట్లతో దూసుకుపోతోంది. ముఖ్యంగా 'గుంటూరు కారం', 'లక్కీ భాస్కర్', ' సంక్రాంతికి వస్తున్నాం ' వంటి చిత్రాలు ఆమె ఖాతాలో భారీ విజయాలుగా నిలిచాయి. 'సంక్రాంతికి వస్తున్నాం' సినిమాతో మీనాక్షి క్రేజ్ నెక్స్ట్ లెవల్‌కు వెళ్లిందని చెప్పొచ్చు.

### బుల్లిరాజు కొత్త సినిమా.. పవర్‌ఫుల్‌గా టీజర్



అనన్య శర్మ, ఎస్ కృష్ణ ప్రధాన పాత్రల్లో వస్తోన్న లేటేస్ట్ మూవీ హై. ఈ సినిమాకు ఎస్ కృష్ణ దర్శకత్వం వహిస్తున్నారు. ఈ చిత్రాన్ని ఇమేజ్‌స్పార్క్ ఎంటర్‌టైన్‌మెంట్, మైరా క్రియేషన్స్ బ్యానర్లపై హరీష్ పెద్ది, ఎస్ కృష్ణ, శేఖర్ దివ్వెల నిర్మిస్తున్నారు. తాజాగా ఈ మూవీ టీజర్‌ను మేకర్స్ రిలీజ్ చేశారు. టాలీవుడ్ హీరో విక్టరీ వెంకటేశ్ చేతుల మీదుగా ఈ టీజర్‌ను విడుదల చేశారు. ఈ టీజర్ చూస్తుంటే యూత్‌ఫుల్ క్రైమ్ కామెడీ ఎంటర్‌టైనర్‌గా తెరకెక్కించినట్లు తెలుస్తోంది. టీజర్‌లో సన్నివేశాలు క్రైమ్ స్టోరీని తలపించేలా ఉన్నాయి. సంక్రాంతికి వస్తున్నాం ఫేమ్ బుల్లిరాజు(రేవంత్) ఈ టీజర్‌లో స్పెషల్ అట్రాక్షన్‌గా కనిపించాడు. కాగా.. ఈ సినిమాలో రేవంత్ (బుల్లిరాజు), పల్లవి దొర, కృష్ణ కమల్, సాయికృష్ణ కీలక పాత్రల్లో నటించారు. ఈ చిత్రానికి వికాస బాదిసా సంగీతమందిస్తున్నారు.

## మరోసారి భయపెట్టబోతున్న ఆది సాయికుమార్!




'శంబాల' చిత్రంతో రీసెంట్‌గా ఆది సాయి కుమార్ బ్లాక్ బస్టర్ విజయాన్ని అందుకున్నారు. మరోసారి అద్భుతమైన కథతో ఆడియెన్స్ ముందుకు వచ్చేందుకు సిద్ధంగా ఉన్నారు. ఆది సాయికుమార్ హీరోగా, గ్లామరస్ హీరోయిన్ వేదిక హీరోయిన్‌గా నటించిన హారర్ థ్రిల్లర్ మూవీ 'జంగిల్' త్వరలో ప్రేక్షకుల ముందుకు రానుంది. సరికొత్త కథనం, ఒళ్లు గగుర్పొడిచే నేపథ్యం, థ్రిల్లింగ్ ఎలిమెంట్స్‌తో ఈ సినిమా రూపొందింది అని చిత్రయూనిట్ చెబుతోంది. ఈ చిత్రాన్ని ఫ్రైడే పిక్చర్స్ బ్యానర్ మీద రాఘవ రెడ్డి పబ్బతి ప్రతిష్ఠాత్మకంగా తెలుగులో విడుదల చేయడానికి సిద్ధమయ్యారు. థియేట్రికల్, శాటిలైట్, డిజిటల్ రైట్స్‌తో పాటు అన్ని హక్కులను ఫ్రైడే పిక్చర్స్ స్వాధీనం చేసుకోవడం విశేషం. అతి త్వరలోనే గ్రాండ్ రిలీజ్ ప్లాన్ చేస్తోంది టీం. ప్రస్తుతం 'జంగిల్' సినిమా పోస్ట్ ప్రొడక్షన్ దశలో ఉంది. ఫైనల్ వీఎఫ్ఎక్స్ వర్క్స్ శరవేగంగా కొనసాగుతున్నాయి. ఈ మూవీలో ఆది సాయికుమార్ పూర్తిగా భిన్నమైన పాత్రలో కనిపించనున్నారు. అలాగే వేదిక పాత్ర సినిమాకు ప్రధాన ఆకర్షణగా నిలవనుందని చిత్ర యూనిట్ వెల్లడించింది. హారర్‌తో పాటు సస్పెన్స్, థ్రిల్లర్ అంశాలను సమపాళ్లలో మేళవించిన ఈ సినిమా ప్రేక్షకులను చివరి వరకు కట్టిపడేస్తుందని నిర్మాతలు ధీమా వ్యక్తం చేస్తున్నారు. త్వరలో ట్రైలర్‌తో పాటు ఫస్ట్ లుక్‌ను అధికారికంగా లాంచ్ చేయనున్నట్లు చిత్ర బృందం వెల్లడించింది. ఇకపై కంటిన్యూగా అప్డేట్‌లను ఇస్తామని టీం చెబుతోంది.



## ఫైనల్‌గా సెట్స్ మీదకు హనుమాన్ 2!

'హనుమాన్' సినిమాతో పాన్ ఇండియా స్థాయిలో సెన్సేషన్ క్రియేట్ చేసిన ప్రశాంత్ వర్మ సినిమాటిక్ యూనివర్స్ నుంచి రాబోతున్న మరో పవర్‌ఫుల్ ప్రాజెక్ట్ 'హనుమాన్ 2'. ఈ సినిమాపై ఇప్పటికే అఫీషియల్ అనౌన్స్‌మెంట్ రాగా.. ప్రేక్షకులు అండ్ సినీ లవర్స్‌లో హై ఎక్స్‌పెక్టేషన్స్ నెలకొన్నాయి. అలాగే హనుమంతుడిగా రిషబ్ శెట్టి ఫస్ట్ లుక్ పోస్టర్‌కు కూడా నెట్టింట్ సూపర్ రెస్పాన్స్ వచ్చింది. ఇదిలా ఉంటే.. ఈ మధ్య కాలంలో హనుమాన్ 2 నుంచి ఒక్క అప్డేట్ కూడా రాకపోవడంతో అసలు ఈ సినిమా సెట్స్ మీదకు వెళ్తుందా లేదా అనే అనుమానాలు వ్యక్తం అవుతున్న క్రమంలోనే తాజాగా అదిరిపోయే బజ్ నెట్టింట సందడి చేస్తుంది. చాలా గ్యాప్ తర్వాత ప్రశాంత్ వర్మ 'హనుమాన్2' సినిమాను లాక్ చేసినట్లు తెలుస్తుంది. మార్చి నుండి షూటింగ్ ప్లాన్ చేస్తున్నట్లు టాక్ వినిపిస్తుండగా.. వచ్చే ఏడాది గ్రాండ్ పాన్-ఇండియా విడుదలకు ప్లాన్ చేస్తున్నారు మేకర్స్.

## ధనుష్‌తో ప్రేమాయణం .. మృణాల్ ఠాకూర్‌పై మరో హీరో పూల వర్షం.. !

బాలీవుడ్ నటి మృణాల్ ఠాకూర్ ఈ మధ్య కాలంలో డేటింగ్, పెళ్లి రూమర్లతో హాట్ టాపిక్‌గా నిలుస్తూ ఉండడం మనం చూస్తూ ఉన్నాం. ఈ రూమర్స్ మధ్య బాలీవుడ్ హీరో చేసిన పని హాట్ టాపిక్‌గా మారింది. యంగ్ హీరో సిద్ధాంత్ చతుర్వేది మృణాల్‌పై పూల వర్షం కురిపించిన వీడియోలు ప్రస్తుతం సోషల్ మీడియాలో విపరీతంగా వైరల్ అవుతున్నాయి. మృణాల్ ఠాకూర్, సిద్ధాంత్ చతుర్వేది కలిసి నటించిన తాజా చిత్రం 'దో దీవానే షెహర్ మే' ప్రమోషన్లలో భాగంగా ఈ జంట ఒక ఈవెంట్‌లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఈవెంట్ వేదిక బయట ఫొటోగ్రాఫర్లతో మాట్లాడుతున్న మృణాల్‌పై సిద్ధాంత్ గొడుగులో నింపుకుని తెచ్చిన పూలతో అకస్మాత్తుగా పూల వర్షం కురిపించాడు. దీనికి మృణాల్ ఇచ్చిన స్మైల్ రియాక్షన్ నెటిజన్లను ఆకట్టుకుంది. అక్కడితో ఆగని సిద్ధాంత్, అదే ప్రమోషనల్ ఈవెంట్ స్టేజ్‌పైనా మరోసారి మృణాల్‌పై పూలు చల్లాడు. ఈ రెండు ఘటనలకు సంబంధించిన వీడియోలు సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతుండటంతో వీరిద్దరి మధ్య ఏదైనా ప్రత్యేక బంధం ఉందా అనే చర్చలు మొదలయ్యాయి. అభిమానులు, నెటిజన్లు తమదైన శైలిలో కామెంట్లు చేస్తూ ఊహాగానాలు పెంచుతున్నారు. మరోవైపు మృణాల్ ఠాకూర్ తమిళ స్టార్ హీరో ధనుష్‌తో డేటింగ్‌లో ఉందనే వార్తలు కూడా కొంతకాలంగా వినిపిస్తున్నాయి. ఫిబ్రవరి 14న వీరిద్దరి పెళ్లి జరుగుతుందనే రూమర్లు వచ్చినప్పటికీ మృణాల్ టీమ్ వాటిని ఖండించింది. అవి కేవలం పుకార్లేనని స్పష్టం చేసింది. అయినప్పటికీ ఈ డేటింగ్ వార్తలు మాత్రం పూర్తిగా చల్లారలేదు. సిద్ధాంత్‌తో మృణాల్ తరచుగా కలిసి కనిపించడం కూడా కొత్త చర్చలకు దారితీస్తోంది. అయితే వీరిద్దరూ కలిసి సినిమా చేస్తున్న కారణంగా ప్రమోషన్లలో భాగంగానే కలుస్తున్నారని సినీ వర్గాలు చెబుతున్నాయి. కానీ ప్రమోషన్‌లకు అతీతంగా కూడా కలిసి కనిపించారనే వార్తలు రావడంతో ఊహాగానాలు మరింత పెరుగుతున్నాయి. ప్రస్తుతం మృణాల్ ఠాకూర్ తెలుగు, హిందీ భాషల్లో వరుస ప్రాజెక్టులతో బిజీగా ఉంది. 'దో దీవానే షెహర్ మే' చిత్రం ఫిబ్రవరి 20న ప్రేక్షకుల ముందుకు రానుండగా, అడివి శేష్‌తో కలిసి నటించిన తెలుగు సినిమా 'డెకాయిట్' ఏప్రిల్ 10న విడుదలకు సిద్ధమవుతోంది. ఈ క్రమంలో మృణాల్ వ్యక్తిగత జీవితం, కెరీర్ రెండూ కూడా వార్తల్లో నిలుస్తున్నాయి.



Printed and Published by V. Srinivas Reddy on behalf of M/s Sai Krishna Publications, Owned by M/s Sai Krishna Publications Printed at Sree Seshasai Enterprises, Plot No. 98/1, Co-operative Industrial Estate, IDA, Gandhinagar, Quthbullapur Mandal, Medchal-Malkajgiri Dist, Telangana. Published at Plot No. 3, Flat No.13, Surya Saroj Apartments, HUDA Complex, Saroornagar Ranga Reddy District.(Hyd) - 500 035, Telangana. Editor : V. SRINIVAS REDDY, cell:9440231967 RNI No. APTEL/2010/36516, prajajyothiadilabad@gmail.com